



# విజయభాను






విశాఖపట్నం, గురువారం 14-12-2017 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 91 పేజీలు : 8 వెల : 1 రూపాయి



## హోంగార్డులకు శుభవార్త..

- జీతం రూ.20 వేలకు పెంపు
- పోలీసు, హోంగార్డులకు వైద్యబీమా
- మహిళా హోంగార్డులకు ప్రసూతి సెలవు
- సీఎం కేసీఆర్ వరాల జల్లు

హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ హోంగార్డులపై వరాల జల్లు కురిపించారు. హోంగార్డుల జీతం రూ.20 వేలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రతి సంవత్సరం హోంగార్డుల మొత్తం జీతంపై రూ.1000 పెంపు అమలు చేస్తామన్నారు. ప్రగతి భవన్‌లో బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ హోంగార్డులతో సమావేశమయ్యారు. హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డితోపాటు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో సీఎం మాట్లాడుతూ హైదరాబాద్ వంటి నగరాల్లో హోంగార్డులు రూ.12వేల జీతంతో జీవనం సాగించడం కష్టమని సీఎం అన్నారు.

మన ఆదాయం అంతా మన ప్రజలకు చెందాలనే లక్ష్యంతోనే ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడామని సీఎం స్పష్టం చేశారు. నేటి నుంచి ప్రత్యేక కానిస్టేబుల్ నియామకాల్లో హోంగార్డులకు 25 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని సీఎం కేసీఆర్ వెల్లడించారు. రిజర్వ్‌డ్ కానిస్టేబుళ్ల నియామకంలో హోంగార్డులకు 15 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని తెలిపారు. డ్రైవర్ల నియామకంలో హోంగార్డులకు 20 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. రోస్టర్ విధానం లేకుండా ఎలాంటి నియామక ప్రక్రియ జరగొద్దని ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. రోస్టర్ అమలు చేస్తూనే హోంగార్డులపై నియామక అధికారులు కాస్త దయ చూపాలన్నారు. పరీక్ష కూడా సాధారణ అభ్యర్థులతో కాకుండా హోంగార్డులకు ప్రత్యేకంగా నిర్వహించాలని నిర్దేశించారు. కానిస్టేబుల్ పరీక్ష రాసే హోంగార్డులకు వయోపరిమితి 40 ఏళ్లకు పెంచుతామన్నారు.

కమ్యూనికేషన్ విభాగంలో హోంగార్డులకు 10 శాతం రిజర్వేషన్ ఇస్తాం. ట్రాఫిక్ కానిస్టేబుళ్ల తరువాయి 2లో

## దేశానికి రైతే వెన్నెముక

### యువశాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించాలి

### గవర్నర్ నరసింహన్ సూచన



హైదరాబాద్: యువ శాస్త్రవేత్తలు పల్లెలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పించాలని గవర్నర్ నరసింహన్ సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ మొదటి వార్షికోత్సవానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా గవర్నర్ పీజీ, పీహెచ్‌డీకి చెందిన 207 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ దేశానికి రైతే వెన్నెముక అన్నారు.

వ్యవసాయ రంగంలో మరిన్ని పరిశోధనలు జరగాలన్నారు. అధిక సాగుబడికి మనవంతు సహకారం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రవీణ్‌రావు, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ త్రిలోచన్ మహాపాత్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆధార్ లింక్‌పై గడువు పొడిగింపు



న్యూఢిల్లీ : ఆధార్ అనుసంధానంపై కేంద్రం మరో గుడ్‌న్యూస్ చెప్పింది. బ్యాంకు అకౌంట్లకు ఆధార్ నెంబర్‌ను లింక్ చేసుకునే డెడ్‌లైన్ డిసెంబర్ 31ను విత్‌డ్రా చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. కొత్త డెడ్‌లైన్‌ను కేంద్రం త్వరలోనే ప్రకటించనున్నట్టు పేర్కొంది. ప్రస్తుతమైతే డిసెంబర్ 31గా ఉన్న తుది గడువును ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అన్ని బ్యాంకు అకౌంట్లకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని ప్రభుత్వం పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే మిగతా అన్ని సర్వీసులకు ఆధార్‌ను అనుసంధానించే తుది గడువుల్లో ఎలాంటి మార్పు లేదు. తరువాయి 2లో

## పార్లమెంట్ ఉగ్రదాడిపై నివాళి

### కరచాలనంతో మోదీ, మన్‌మోహన్



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ జాతికి క్షమాపణలు చెప్పాలని రెండు రోజుల క్రితమే మాజీ ప్రధాని మన్మోహన్ డిమాండ్ చేశారు. కానీ ఇవాళ ఢిల్లీలోని పార్లమెంట్ తరువాయి 2లో

## రూపాయికే విమాన టికెట్!



న్యూఢిల్లీ: ఎయిర్ డెక్కన్ మళ్లీ వచ్చింది. రూపాయికే విమాన టికెట్ అంటూ ఊరిస్తున్నది. రీజినల్ కనెక్టివిటీ స్కీమ్ లేదా ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్ (యూడీఏఎన్) కింద తమ ఆపరేషన్స్‌ను ఈ నెల 22 నుంచి మొదలుపెట్టనుంది. ఎయిర్ డెక్కన్ తొలి విమానం ముంబై, నాసిక్ మధ్య ఎగరనున్నది. ఇందులో తరువాయి 2లో

## నువ్వు చెప్తేనే ప్రజలు టీడీపీకి ఓటేశారు

- బాబు వద్ద ప్యాకేజీకి లొంగిపోయావ్
- పవన్.. నువ్వు గజినీలా మారిపోవద్దు
- పవన్ ప్రసంగానికి దిమ్మతిరిగే కౌంటర్
- వైకాపా ఎమ్మెల్యే రోజా



అమరావతి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నగరి ఎమ్మెల్యే రోజా బుధవారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్యాకేజీలు తీసుకునే వాళ్లకు ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని జనసేనానిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

చంద్రబాబు వద్ద ప్యాకేజీ తీసుకొని పవన్ మాట్లాడుతున్నారని వైసీపీ విమర్శలు చేస్తోన్న విషయం తెలిసిందే.

ఇటీవల పవన్ కళ్యాణ్ ఏపీలో నాలుగు రోజుల పాటు పర్యటించారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్‌పై మండిపడ్డారు. ప్రజా సమస్యలు తీర్చాలంటే పదవులు ఉండనక్కర లేదని, వైసీపీ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించడం సరికాదని జనసేనాని అభిప్రాయపడ్డారు.

ఈ నేపథ్యంలో రోజా స్పందించారు. పవన్ కళ్యాణ్‌కు తమ పార్టీ అధినేత జగన్‌ను ప్రశ్నించే నైతిక హక్కు లేదని రోజా మండిపడ్డారు. జగన్ నిత్యం ప్రజల్లో ఉంటున్నారని ఆమె చెప్పారు. డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు, రైతులకు అన్యాయం జరుగుతోందని పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

నువ్వు చెబితే ఓటేశారు 2014 ఎన్నికల తరువాయి 2లో



## చంద్రన్న మాల్స్‌పై రోజావి అర్థం లేని ఆరోపణలు

విజయవాడ: వైకాపా ఎమ్మెల్యే రోజా అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మండిపడ్డారు. చంద్రన్నమాల్స్‌పై వైసీపీ ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. బుధవారం విద్యాధరపురంలో చంద్రన్న వీలేజ్ మాల్‌లో సరుకుల ధరలు, నాణ్యతను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ రేషన్‌కు.. చంద్రన్నమాల్స్‌కు సంబంధం లేదని అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా విజయవాడ, గుంటూరులో తరువాయి 2లో

## ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం సేవలు వినియోగించుకోవాలి



విశాఖపట్నం: ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం సేవలు వినియోగించుకోవాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. బుధవారం కంచరపాలెం ఆర్.పి పేటలోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రంను సందర్శించి సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఇ-వైద్యాలయాన్ని సందర్శించారు. రక్త పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి ఎంతమందికి పరీక్షలు నిర్వహించారని వాకబు చేయగా 22 మందికి నిర్వహించినట్లు తెలిపారు. పిల్లలకు టీకాలు వేయడాన్ని పరిశీలించారు. ఎంత మంది టి.బి రోగులకు సరఫరా చేస్తున్నారని ప్రశ్నించగా62 మందికి సరఫరా చేస్తున్నారని క్రమం తప్పకుండా మందులు తీసుకొంటున్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ పరీక్ష రూం, మందులు అందజేసే ఫార్మశీని పరిశీలించి వివరాలు తెలుసుకోన్నారు. తదుపరి మరుగు దొడ్లు, బాత్‌రూంలను పరిశీలించి మరుగుదొడ్లను మరమ్మతు చేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కుర్చీలు, తదితర అవసరాలు గురించి రోగులు తెలుపగా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. పర్యటనలో నాలుగవ జోన్ ఏ.యం.ఓ.హెచ్ డా.మురళీ మోహన్, అసిస్టెంట్ కలెక్టర్ మీషాసింగ్ తదితరులు పాల్గోన్నారు.




# చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ ప్రారంభించిన సినీ తార శ్రియ



కాకినాడ : వస్త్ర ప్రపంచంలో పేరెన్నికగన్న చందన బ్రదర్స్ తన నూతన షాపింగ్ మాల్‌ను బుధవారం కాకినాడ మెయిన్ రోడ్డులో ప్రారంభిం చింది ప్రముఖ సినీతార కుమారి శ్రియ ప్రారంభోత్సవానికి విచ్చేసారు. షాపింగ్ మాల్ యాజమాన్యం, ప్రతినిధులు, అభిమానులు నటి శ్రియకు ఘన స్వాగతం పలికారు. షోరూం ప్రారంభం అనంతరం నటి శ్రియ పలు విభాగాలను కలియతిరిగి వస్త్రాలను, ఆభరణాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చందన బ్రదర్స్ అంటేనే నమ్మకమైన వస్త్రాభరణాలకు చిరునామా అని పేర్కొన్నారు. చందన వస్త్రాభరణాలు ఎంతో పేరెన్నిక గలవని అధునాతన, సాంప్రదాయ వస్త్రాలు లభిస్తాయన్నారు. అధినేత చందన మోహనరావు మాట్లాడుతూ తమ షాపింగ్ మాల్‌లో అన్నిరకాల వస్త్రాభరణాలు, మెటీరియల్స్, రకరకాల జోళ్ళు,షూలు లభిస్తాయని ప్రజల అభిరుచులకు తగ్గట్టుగా అధునాతన డిజైన్లలో వస్త్రాభరణాలు అందిస్తామన్నారు. అలాగే క్రిస్మస్, సంక్రాంతికి పండుగలు పురస్కరించుకొని వస్త్రాలపై ఆకర్షణీయమైనరాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల వారికి అందుబాటు ధరలలో విభిన్న డిజైన్లలో వస్త్రాలు లభ్యమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి, మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ, చందన 35వ డివిజన్ కార్పోరేటర్ బలువూరి రామకృష్ణ, చందన జగదీష్, చందననగేష్ ఆనంద్, చందన నాగేశ్వర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మండల ఉపాధ్యక్షుడు బొమ్మిడి సత్తిబాబుకు పితృ వియోగం

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం శంఖవరం మండలం మండల ఉపాధ్యక్షుడు బొమ్మిడి.సత్తిబాబు తండ్రి బొమ్మిడి.సూర్యరావు మంగళవారం రాత్రి హఠాత్తుగా గుండె ఆగి పరమపదించారు. ఆయనకు ముగ్గురు కొడుకులు.ఆయన కొద్ది సంవత్సరాలుగా టిడిపిలో పనిచేస్తున్నారు.పెద్దబ్బాయి శంఖవరం మండల వైస్ ప్రెసిడెంట్ గా ఉన్నారు. సత్తిబాబును పట్టణ టిడిపి అధ్యక్షుడు కుటుంబ సభ్యులను పరమర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

# ప్రత్యేక హోదా కోసం వై.యస్.ఆర్.ఎస్.యు. ఆధ్వర్యంలో ఏ.యూ. విద్యార్థుల ర్యాలీ




విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా కావాలని కోరుతూ చేపట్టిన కార్యక్రమానికి ఆంధ్రాయూనివర్శిటీ నుండి వై.యస్.ఆర్. విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులు బయలుదేరినట్లు తెలిపారు. ముందుగా ఆంధ్రాయూనివర్శిటీ వై.యస్.ఆర్. విగ్రహానికి పూలదండవేసి అనంతరం ర్యాలీగా బయలుదేరి ఎల్.ఐ.సి. బిల్డింగ్ దగ్గరికి చేరటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వై.యస్. ఆర్.యస్.యు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు మాట్లాడుతూ 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో 10 సంవత్సరాల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చిన టి.డి.పి., బి.జె.పి.లు ఇవ్వకుండా ప్రజలను మోసం చేశారని, ప్రత్యేక హోదా అనేది సంజీవని అని, ప్రత్యేక హోదా ద్వారా మాత్రమే పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలు వస్తాయని నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. తద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు ఇంటికో ఉద్యోగమని, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ప్రత్యేక హోదా కోసం భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్. స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. కాంతారావు, రాష్ట్ర కార్యదర్శులు బి.మోహన్‌బాబు, టి.సురేష్, ఆర్.ప్రభాకర్ నాయుడు, ఏ.యూ. అధ్యక్షులు ఎ.రాజ్‌కమల్, జీవన్, అభి, రాధ, హరీష్, సతీష్, రంజిత్, జోషి, శంకర్ మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## 17న జరుగు రెడ్డి సంక్షేమ సభను జయప్రదం చేయాలి

ఆలమూరు : ఈనెల 17న బిక్కవోలు మండలం, బలభద్రపురంలో నిర్వహించే "రెడ్డి" సంక్షేమ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా నాయకులు పోతంశెట్టి సాయి, రామ్మోహనరెడ్డి, భీమిరెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డిలు పిలుపునిచ్చారు. వేమన యూత్ ఆధ్వర్యంలో మండల పరిధి జొన్నాడలో మండల రెడ్డి సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు, సంఘ అభ్యున్నతికి, సంఘ పటిష్టతకు అనుసరించవలసిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి (దొరబాబు), నాంధ్ర నాగమోహనరెడ్డి, తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి, తాడి వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

# ధర్నాకు భారీ సంఖ్యలో తరలి వెళ్ళిన వైకాపా యూత్



గాజువాక: ప్రత్యేకహెూదా, విశాఖ రైల్వేజోన్ తదితర అంశాలపై నగరంలో రాష్ట్ర వైయస్ఆర్‌సిపి యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా ఆద్వర్యంలో బుధవారం జరిగిన ధర్నాకు పారిశ్రామిక ప్రాంతంలోని పలువార్డులకు చెందిన వైకాపా యూత్ భారీ సంఖ్యలో ర్యాలీగా నగరానికి తరలివెళ్ళారు. జీవీయంసీ 47వ వార్డు వైకాపా అధ్యక్షులు పి.వి.సురేష్, 48వ వార్డు వైకాపా అధ్యక్షులు మూగి సూర్యనారాయణ ఆద్వర్యంలో ఈ ర్యాలీలను నిర్వహించారు. ఈ సంరద్భంగా జీవీయంసీ 47వ వార్డు వైకాపా అధ్యక్షులు పి.వి.సురేష్ మాట్లాడుతూ ఎన్నికలముందు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హమీలను ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్ర విభజన సమయంలో చట్టంలో పొందుపర్చిన వాటిన పట్టించుకోకపోవడం, ప్రత్యేక హెూదా కల్పించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రత్యేక హెూదా కల్పించడం వలన అనేక అంశాలలో రాష్టానికి మేలు జరుగుతుంని అన్నారు. ప్రత్యేక హెూదాకోసం వైకాపా నిరంతరం పోరాటం చేస్తుందని, అధినేత వైయస్‌జగన్ ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా సంకల్ప యాత్రను చేపట్టారని ,రానున్నదని వైకాపా పాలన అని అన్నారు. వైకాపా అధికారంలోకి వచ్చినపుడే రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తుందని, ప్రజలకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయపురెడ్డి అనీల్, భరత్, సంతోష్, నాగూర్, నాగబాబు, క్రిష్ణ, మళ్ళ ధనలత, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులదే ఆలస్యం... తక్షణం నిర్మాణం



భువనేశ్వర్ : రవుర్కెలా వద్ద బ్రాహ్మణి నదిపై రెండో వంతెన మార్గం నిర్మాణం పనులు రాష్ట్ర అటవీశాఖ అనుమతులపై ఆధారపడి ఉన్నాయి. అది క్లియరెన్స్ ఇచ్చినంతనే జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) పనులు ప్రారంభిస్తుందని ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధి ఎ.కె.సింగ్ స్పష్టం చేశారు. సచివాలయంలో ప్రధాన కార్యదర్శి ఎ.పి.పాఢి, ఇతర అధికారులతో సింగ్ సమావేశమైన తర్వాత విలేకర్లతో మాట్లాడారు. ఉపరితల రవాణా శాఖ ఈ నిర్మాణానికి రూ.382 కోట్లు ఇదివరకే విడుదల చేసిందని, టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని చెప్పారు. బ్రాహ్మణ నది పరివాహక ప్రాంతంలో అటవీశాఖకు చెందిన స్థలం ఉన్నందున దాని అనుమతులు తప్పనిసరి కావడంతో వేచి చూస్తున్నామన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశా మన్నారు. త్వరలో క్లియరెన్స్ వస్తుందన్న ఆశాభావంతో ఉన్నా మన్నారు. బ్రాహ్మణ నదిపై రెండో వంతెన మార్గం పనులను కేంద్రం జాప్యం చేస్తోందని బిజద పాలకులు ఆగ్రహించిన సంగతి విదితమే. దీనిపై శాసనసభలో రభస జరిగిన తర్వాత ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ కేంద్ర ఉపరితల రవాణ మంత్రి నితిన్ గడ్కరీకి ఘాటుగా లేఖ రాశారు. దీనికి గడ్కరీ సమాధానం కూడా ఇచ్చారు. అటవీశాఖ అనుమతుల వద్దనే పనులు ఆగిపోయి ఉన్నట్లు ఎట్టకేలకు తేలింది.

మొదటి పేజీ తరువాయి

## హోంగార్డులకు శుభవార్త

ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకుని అలవెన్సులు పెంచినట్లు సీఎం చెప్పారు. పెంచిన అలవెన్సులు 2018 జనవరి నుంచి అమలు చేస్తామని చెప్పారు. ట్రాఫిక్ విభాగంలో పనిచేసే హోంగార్డులకు శాశ్వత ఉద్యోగితో సమానంగా అలవెన్సు ఇస్తామని వెల్లడించారు. నగరంలో పనిచేసే హోంగార్డులకు బస్సు పాస్ సౌకర్యం కల్పిస్తామని.. 18,900 మంది హోంగార్డులకు కోరుకున్న చోట డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పారు. నగర శివారు కొల్లూరు వద్ద 15వేల ఇళ్ల నిర్మాణానికి స్థలం పరిశీలించామన్నారు.

పోలీసు, హోంగార్డుల కుటుంబానికి మంచి వైద్య బీమా సదుపాయం కల్పిస్తామని సీఎం పేర్కొన్నారు. పోలీసు ఆస్పత్రుల్లో పోలీసులతో సమానంగా హోంగార్డులకు వైద్య సదుపాయాలు అందించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ మహిళా పోలీసులతో సమానంగా మహిళా హోంగార్డులకు 6 నెలల ప్రసూతి సెలవు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోరాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ఎవరూ వెట్టిచాకిరీ చేయకూడదని సీఎం అన్నారు. ఎన్నో సమస్యలతో తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఒక్కో సమస్యను క్రమానుగతంగా పరిష్కరించుకుంటూ వస్తున్నాం. చాలా విభాగాల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది. వేలల్లో ఉన్నారు. అసలు పరిస్థితి మీకు అర్థం కావాలనే అందరినీ పిలిపించుకుని మాట్లాడుతున్నట్లు సీఎం కేసీఆర్ హోంగార్డులకు తెలిపారు.

## పార్లమెంట్ ఉగ్రదాడిపై నివాళి

ఆవరణలో మరో సీన్ కనిపించింది. ప్రధాని మోదీ, మాజీ ప్రధాని మన్మోహన్‌లు కలుసుకున్నారు. మన్మోహన్‌కు షేక్ హ్యాండ్ కూడా ఇచ్చారు మోదీ. ఇద్దరూ ఒకరికి ఒకరు విషెస్ చెప్పుకున్నారు. పార్లమెంట్‌పై ఉగ్రవాదులు దాడి జరిపి ఇవాళ్టికి 16 ఏండ్లు గడిచాయి. ఈ సందర్భంగా అక్కడ నివాళి అర్పించారు. ఆ కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు మాజీ ప్రధాని మన్మోహన్, సోనియా, రాహుల్ ఇతర నేతలు కూడా హాజరయ్యారు. గుజరాత్ ఎన్నికల్లో పాక్ జోక్యం చేసుకుంటున్నదని ఇటీవల ప్రచార సభలో మోదీ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత అయ్యర్ ఇంట్లో జరిగిన డిన్నర్ పార్టీలో ఆ ఎన్నికల గురించి చర్చలు కూడా జరిగినట్లు మోదీ ఆరోపించారు. మాజీ ప్రధాని మన్మోహన్ కూడా ఆ మీటింగ్‌లో పాల్గొన్నట్లు మోదీ విమర్శించారు. అయితే మోదీ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న మన్మోహన్ ఆ తర్వాత ఓ లేఖ సంధించారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలు తనను బాధించాయని చెప్పారు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్తారని ఆశిస్తున్నట్లు కూడా మన్మోహన్ ఆ లేఖలో వెల్లడించారు. అయితే పార్లమెంట్ దాడి ఘటనకు నివాళి అర్పించేందుకు వచ్చిన మోదీ.. అక్కడే ఉన్న మన్మోహన్‌తో కరచాలనం చేశారు.

## *రూపాయికే విమాన టికెట్!*

రూ.1400 నుంచి ప్రారంభ ధరలు ఉన్నా.. కొందరు లక్కీ విన్నర్లకు రూపాయికే ఇస్తామని సంస్థ ప్రకటించింది. గంటలోపు ప్రయాణానికి రూ.2500కే టికెట్ అంటూ ఈ యూడీఏఎన్ స్కీమ్‌ను మొదలుపెట్టిన విషయం తెలిసిందే. దీనికింద ఐదు ఎయిర్‌లైన్స్ 12 రూట్లలో తమ విమానాలను నడిపే అవకాశం కల్పించారు. మార్చిలో ఈ అనుమతులు జారీ కాగా.. సర్వీసులను ప్రారంభించేందుకు సెప్టెంబర్ 30తోనే ఈ డెడ్‌లైన్ ముగిసింది. ఈ స్కీమ్ కిందే ఎయిర్ డెక్కన్ 34 రూట్లను సొంతం చేసుకుంది. ఎయిర్ డెక్కన్‌తోపాటు ఎయిర్ ఒడిశా, అలయెన్స్ ఎయిర్, స్పైస్ జెట్, ట్రూజెట్ ఈ 12 రూట్లను సొంతం చేసుకోగా.. ప్రస్తుతం కేవలం 15 రూట్లలోనే ఈ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ హక్కులు దక్కించుకున్న ఎయిర్‌లైన్స్ తమ విమానంలో ఉన్న సగం సీట్లను డిస్కౌంట్లలో ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి ప్రభుత్వం నుంచి సబ్సిడీ లభిస్తుంది.

## నువ్వు చెప్తేనే ప్రజలు టీడీపీకి ఓటేశారు

సమయంలో నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడుకు జగన్ మద్దతిచ్చారని గుర్తు చేశారు. బాబు, మోడీకి ఓటేయండని అప్పుడు నీవు చెబితే కాపు సామాజిక వర్గం నమ్మి ఓట్లేసిందని, కానీ వారికి అన్యాయం జరుగుతోందని, పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

### *ప్యాకేజీ కోసమే పవన్ కళ్యాణ్ విమర్శలు*

ప్యాకేజీ కోసమే పవన్ కళ్యాణ్ తమ పార్టీ అధినేతపై విమర్శలు చేస్తున్నారని రోజా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్యాకేజీలు తీసుకుంటే ప్రజా సమస్యలు ఎలా పడతాయన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వని మోడీని, ప్రజలకు న్యాయం చేయని చంద్రబాబును ప్రశ్నించాల్సింది పోయి మమ్మల్ని ప్రశ్నించడం ఏమిటని మండిపడ్డారు. తనకు పదవులపై మమకారం లేదని, అధికారం యావ లేదని చెప్పిన పవన్ కళ్యాణ్‌కు రోజా ధీటైన కౌంటర్ ఇచ్చారు.

జగన్‌కు పదవులు వద్దనుకుంటే, పదవుల కోసం పార్టీ పెట్టలేదని అనుకుంటే ఓ ఛారిటబుల్ ట్రస్ట్ పెట్టుకోవచ్చునని హితవు పలికారు. జనసేనకు అజెండా లేదన్నారు.

### *పవన్ గజినీలా మారిపోవద్దు*

పవన్ కళ్యాణ్ గజినీలా అన్నీ మర్చిపోకూడదని రోజా ఎద్దేవా చేశారు. ఎన్నికల సభలో ఆనాడు నరేంద్ర మోడీ, చంద్రబాబు ఏం చెప్పారో గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. పవన్ కళ్యాణ్‌కు స్క్రిప్ట్ రాసే వ్యక్తికి అవగాహన లేనట్లుగా ఉందన్నారు.

చంద్రబాబు గురించి మాట్లాడుతూ.. మళ్లీ ఛాన్స్ తనకు లేదని చెప్పే చంద్రబాబు ఇష్టారీతిన దోచుకుంటున్నారని ఆరోపించారు.

## ఆధార్ లింక్‌పై గడువు పొడిగింపు

పాన్ నెంబర్‌ను ఆధార్ నెంబర్‌తో అనుసంధానించే తుది గడువు 2018 మార్చి 31 వరకు ఉండగా.. మొబైల్ నెంబర్లను ఆధార్‌తో లింక్ చేసుకునే తుది గడువు 2018 ఫిబ్రవరి 6తో ముగియనుంది. ప్రభుత్వం అందించే అన్ని సామాజిక భద్రత, సంక్షేమ పథకాలకు సంబంధిత అధికార విభాగాలకు ఆధార్ వివరాలను అందించే ప్రక్రియకు తుది గడువు 2017 డిసెంబర్ 31గా ఉంది. ఇప్పటి వరకు ఆధార్ కార్డు పొందని వారి కోసం, ఇటీవలే ఆధార్ నెంబర్ అనుసంధానం చేసే గడువును 2018 మార్చి 31వ తేదీ వరకు పొడిగించిన సంగతి తెలిసిందే.

## చంద్రన్న మాల్స్‌పై రోజావి అర్ధం లేని ఆరోపణల

చంద్రన్న విలేజ్ మాల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వినియోగదారులకు 4 నుంచి 35 శాతం వరకు తక్కువ ధరలకు ఇస్తున్నామని, అలాగే డీలర్లకు ఆదాయం సమకూరే విధంగా చంద్రన్న విలేజ్ మాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రత్తిపాటి వెల్లడించారు. చంద్రన్నమాల్స్‌లో 500 రకాల సరుకులు లభిస్తున్నాయని అన్నారు.

భారతీ సిమెంట్ తక్కువ ధరకు ఎందుకు అమ్మడం లేదని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వైసీపీని ప్రశ్నించారు. నాణ్యమైన సరుకులు తక్కువ ధరకు ఇవ్వడం వైసీపీకి ఇష్టం లేదా.? అంటూ ఆయన మండిపడ్డారు. రాష్ట్రం కోసం శ్రమిస్తున్న చంద్రబాబు పేరు పెడితే తప్పేంటి? అని అన్నారు. పథకాలు, పేర్లు గురించి విమర్శించే అర్హత వైసీపీకి లేదని ప్రత్తిపాటి అన్నారు.

# వేతన సిఫారసుల అమలుకు ఆందోళన




రాయచూరు : వివిధ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 'బీఎస్ఎన్ఎల్ అధికారులు, అధికారులేతర సంఘం' ఇక్కడి డీడీపీఐ కార్యాలయానికి సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద రెండ్రోజుల ఆందోళన ప్రారంభించింది. ఈ సంద ర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ మూడో వేతన సంఘ సిఫార్సుల సవరణలను జనవరి 1, 2017 నుంచి వర్తింప చేయాలన్నారు. రెండో వేతన సంఘం సిఫార్సుల్లో నెరవేర్చని హామీలను పరిష్కరించాలని కోరారు. గతంలో పై డిమాండ్లపై పోరాటం చేసినా స్పందించనందున తిరిగి ఆందోళనకు దిగామన్నారు.

హొసపేటె: జీతభత్యాల్లో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపిస్తూ ఇక్కడ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సంద ర్భంగా నేతృత్వం వహించిన మధుసూధన్, సణ్ణక్కి వెంకోబ తదితరులు మాట్లాడుతూ 3వ వేతన సంఘంలో ఇంకా పరిష్కరణ చేయాల్సి ఉంది. 2వ వేతన సంఘం జారీ సమయంలో కరవుభత్యం పట్ల సందిగ్ధత ఉంది. ఆ విషయాన్ని వెంటనే పరిష్కరించాలి. టవర్ ప్రైవేటీకరణ చేసే ఆలోచనను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం కూడా ఆందోళన కొనసాగుతుందని తెలిపారు.

## డిసిఐ ఉద్యోగుల ఆందోళనకు
# అఖిలపక్ష కార్మికసంఘాల మద్దతు

విశాఖపట్నం : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డిసిఐ)ను 100శాతం ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ విశాఖపోర్టులోని అఖిలపక్ష కార్మికసంఘాలు పోర్టు ప్రధానకార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించాయి. డిసిఐ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలియజేశాయి. ఈ ధర్నానుద్దేశించి యునైటెడ్ పోర్టు&డాక్ ఎంప్లాయీస్ యూనియన్(సిఐటియు) ప్రధాన కార్యదర్శి వి.ఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ డిసిఐ 1976లో ఏర్పడినప్పటి నుండి లాభాలు ఆర్జిస్తున్నదని, రూ. 28 కోట్ల పెట్టుబడితో ప్రారంభించబడి నేడు సూమారు 6 వేల కోట్ల రూపాయల మేరకు ఆస్తులు సంపాదించిందన్నారు. బంగారు బాతులాంటి డిసిఐని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. దేశంలోని మేజర్ పోర్టులు మరియు ఇండియన్ నేవీకి అవసరమైన డ్రెడ్జింగ్ పనులు సమర్ధవంతంగా నిర్వర్తిస్తుందన్నారు. కొన్ని మేజర్ పోర్టుల్లో కొన్ని డ్రెడ్జింగ్ పనులు ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తే పూర్తి చేయకుండానే అవి సగంలో వదిలేసి వెళిపోయిన నప్పుడు ఆ పనులు తిరిగి డిసిఐచేత చేయించిన అనుభవాలున్నాయన్నారు. ఈ నేపద్యంలో ప్రభుత్వరంగ డిసిఐని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే లాభాలకోసం అవి అమాంతం చార్జీలు అనేక రెట్లు పెంచేస్తాయని, దీని వలన మేజర్ పోర్టులపై అధికభారం పడి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటాయన్నారు. ఇటీవల ప్రకటించిన సాగరమాల ప్రాజెక్టు అమలులో భాగంగా అనేక కొత్త పోర్టులు అభివృద్ధి చేయాల్సిన నేపథ్యంలో తన ఆధీనంలో ఉన్న ప్రభుత్వరంగ డిసిఐని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రయివేటీకరించడం దేశ ప్రయోజనాలకు నష్టం. వ్యూహాత్మకరంగమైనా డిసిఐని ప్రయివేటీకరించడం దేశ భద్రతకు కూడా ప్రమాదమన్నారు. డిసిఐని ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు.

విహెచ్‌పిడబ్ల్యు(ఎఐటియుసి) ప్రధానకార్యదర్శి బి.సి.హెచ్.మసేన్ మాట్లాడుతూ ప్రపంచంలోనే టాప్-10 డ్రెడ్జింగ్ కంపెనీల్లో ఒకటిగా ఉందని విదేశీ వర్కు ఆర్డర్లను సైతం సంపాధించి ఎంతో సమర్ధవంతంగా డిసిఐ పనిచేస్తుందన్నారు. డిసిఐకి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం కావాలని డిసిఐని నిర్వీర్యం చేసి ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం సరైందికాదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో దోహదపడుతున్న ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఇది దేశ ప్రయోజనాలకు నష్టమన్నారు. ఎన్‌పిటిఇ (ఐఎన్‌టియుసి) యూనియన్ ప్రధానకార్యదర్శి కె.పరదేశినాయుడు మాట్లాడుతూ డిసిఐ ప్రయివేటీకరణ వల్ల అందులో పనిచేస్తున్న కార్మికులు రోడ్డున పడతారన్నారు. పోర్టుల అభివృద్ధికి ఆటంకమన్నారు. ప్రభుత్వానికి ఆధాయాలు కూడా తగ్గిపోతాయన్నారు.

ఈ ధర్నాలో సిఐటియు నాయకులు ఎస్.పరశురాం, కె.ఎస్.కుమార్, జె.సత్యన్నారాయణ, కె.సత్యన్నారాయణ, ఎఐటియుసి నాయకులు ప్రకాష్ మరియు కార్మికులు పాల్గొన్నారు.

### భోగాపురంలో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టుకు

# సింహాద్రి అప్పన్న పేరును నామకరణం చేయాలి



మాధవధార : బోగాపురంలో ఎర్పాటు చేయ్యనున్న ఎయిర్‌పోర్టుకు సింహాద్రి అప్పన్న పేరును నామకరణం చేయ్యాలని మాధవధార సింహాద్రి అప్పన్న ప్రచార సమైఖ్య మంగళవారం మాడుగుల శాసన సభ్యులు ముత్యాలనాయుడుకు సమైఖ్య సభ్యులు ముద్రించిన కరపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోగాపురంలో ఎర్పాటు చేయ్యనున్న ఎయిర్‌పోర్టుకు సింహాద్రి అప్పన్న పేరును నామకరణం చేయ్యడం వల్ల ఉత్తరాంధ్ర జిల్లాలకు మంచి పేరు ప్రఖ్యాతులు వస్తాయని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు తెలియజేసి ఎయిర్ పోర్టుకు నామకణం చేసే విదంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న కమిటి సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమైఖ్య సభ్యులు ఎస్. నారాయణస్వామి, ఎస్.రమేష్, పి.సత్తిబాబు, వెంకటరావు, పి.రాంబాబు, జివి.రమణ, సిహెచ్.కళ్యాణ్‌కుమార్, పి.శ్రీనివాస్, ఎస్.రవికుమార్, ఎస్.ధనుం జేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ సాధన సమితి సదస్సుకు తరలిరావాలి

### ప్యాప్టో జిల్లా కో-ఛైర్మన్ జి.మధు



అచ్యుతాపురం: ఈనెల 16న విజయవాడలో పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ప్యాప్టో) జిల్లా కో-ఛైర్మన్ జి.మధు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన భాగస్వామ్య సంఘాల ప్రతినిధులతో కలిసి స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 2004 నుండి నియామకం పొందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సామాజిక, ఆర్థిక భద్రతకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సిపియస్) ముప్పుగా పరిణిమించిందన్నారు. ఈ నేపథ్యంలో సిపియస్ రద్దు, పాత పెన్షన్ విధానం సాధనకు రాష్ట్రంలో విశాల ఐక్య ప్రాతిపదికన ఉద్యోగ, కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ (జెఏసి), ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటి (జాక్టో), ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ప్యాప్టో) కలిసి పెన్షన్ సాధన సమితిని ఏర్పాటు చేశాయన్నారు. పొరుగు రాష్ట్రాల సంఘ నాయకులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు, న్యాయ నిపుణులు హాజరవుతున్న ఈ సదస్సుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలని మధు కోరారు. ఈ సమావేశంలో బి.వెంకటేశ్వరరావు, మారిశెట్టి వెంకట అప్పారావు, దోని నూకరాజు, కొల్లి రాజు, సరళాదేవి, మొదీనా బేగం, శివానందం, బి.సత్యనారాయణ తదితరులు వున్నారు.

# ఆదమరిస్తే అంతేసంగతి



అరకులోయ : మండలంలోని లోతేరు రహదారి పనులు విస్తరణ చేస్తూ గొయ్యి తవ్వించి వదిలేశారు. రహదారిని తవ్వడంతో ప్రమాదం పొంచి వుంది. అరకు లోతేరు ప్రధాన రహదారి కావడంతో ఉద్యోగులు, వాహన చోదకులు ప్రతినిత్యం అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాలు, నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. గోతిని గమనించకుండా ఆదమరిచి వాహనాన్ని నడిపితే అంతే సంగతులు. తవ్విన గోతులను విదిలేయకుండా తక్షణమే అధికారులు స్పందించి గోతిని వెంటనే పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

# బివికె కళాశాలకు అరవై లక్షల ఆర్థిక సాయం




విశాఖపట్నం: హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పిసిఎల్) బివికె కళాశాలకు ఆర్థిక సహకారాన్ని రెండు దశల్లో రెండు విధాలుగా అందిస్తోంది. మొదటి దశలో కళాశాల మౌలిక వసతుల కోసం 39 లక్షలు, రెండో దశలో అదనంగా మరో 21 లక్షల రూపాయలు ఉపకార వేతనాల రూపంలో కళాశాల విద్యార్థులకు సమకూరుస్తోంది. రెండు దశల్లోను కలిపి సుమారు 60 లక్షల ఆర్థిక సాయాన్ని హెచ్‌పిసిఎల్, బి.వి.కె కళాశాలకు అందిస్తోందని కళాశాల కరస్పాండెంట్ ఆచార్య కందర్ప విశ్వనాథ్ వివరించారు. హెచ్‌పిసిఎల్ ఈ ఆర్థిక సాయాన్ని సామాజిక అభివృద్ధి కార్యక్రమం (సిఎస్ఆర్)లో భాగంగా చేస్తోంది. మొదటి దశలో ఇస్తున్న 39 లక్షలు కళాశాలలో అవసరమైన మరుగుదొడ్లు, బాత్రూమ్‌ల బ్లాకుల్ని నిర్మించుకోవటానికి, కుర్చీలు, బెంచీలు కొనుక్కోవటానికి హెచ్‌పిసిఎల్ అందిస్తోంది. కళాశాల అవసరాలను శాస్త్రీయంగా లెక్కించి, తగిన ఆధా రాలు జతచేసి, ఆర్థిక సాయాన్ని కళాశాల అడిగిన నేపథ్యంలో ఈ నిధుల్ని మంజూరు చేసిందని విశ్వనాథ్ చెప్పారు. ఓ ప్రభుత్వ రంగ సంస్థ, ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందించడం కళాశాల్లో ఇదే ప్రథమం. కళాశాల చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. కళాశాల అభివృద్ధి చెందటానికి దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు విశ్వనాథ్.

కళాశాల అనుసరిస్తున్న ప్రమాణాలకు, విలువలకు, పద్ధతులకు, పారదర్శక విధానాలకు సేవాభావానికి సజీవ సాక్ష్యంగా ఈ సహకారం నిలుస్తుందన్నారు. ఇంతపెద్ద మొత్తాన్ని అందిం చినందుకు హెచ్‌పిసిఎల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# దేవాలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం




విశాఖపట్నం: పెద్ద వాల్తేరు ప్రధాన రహదారిలో ఉన్న కరకచెట్టు పోలమాంబ దేవాలయంలో మైక్యూర్ హాస్పిటల్ ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. మైక్యూర్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. మైక్యూర్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిభిరాన్ని ఆలయ ఎండోమెంట్ అధికారి ఐన పి.వి.వి. సత్యనారాయణ గారు ప్రారంభించారు. ఈ సందర్బంగా మైక్యూర్ వైద్య బృందం 105 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికీ మందులు ఉచితంగా అందజేశారు. వైద్య శిభిరంలో జూనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు. మైక్యూర్ బృందం ఆలయ అధికారులకి మరియు ఆలయానికి వచ్చిన భక్తులకు షుగర్, బీపీ, పొడువు మరియు బరువు పరీక్షలు నిర్వహించారు. మైక్యూర్ వైద్య బృందం మెరుగైన ఆరోగ్య విషయంలో సలహాలు, సూచనలు అందించారు.

### 26వ వార్డును పరిశుభ్రంగా తీర్చిదిద్దండి

విశాఖపట్నం: జివియంసి మూడవ జోన్‌కు చెందిన 26వ వార్డును మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. 26వ వార్డు కార్యాలయాన్ని బుధవారం పూర్ణామార్కెట్‌లో పరిశీలించి హాజరు పట్టీ పరిశిలించారు. అనంతరం మెయిన్ రోడ్ ను పరిశీలించి పారిశుధ్యం సక్రమంగా లేనందున అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వీపింగ్ మేషీన్‌ను వినియోగించడం ద్వారా నగరాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కోరారు. ఓపెన్ పాయింట్స్ లేకుండా చూడాలని పేర్కొన్నారు. వెలంపేట జంక్షన్, బి.యస్.ఎన్.ఎల్ కార్యాలయం, హెడ్ పోస్టాఫీసు రోడ్‌లను పరిశీలించి పలుసూచనలు చేశారు. డ్రెయిన్ల పూడికతీతను దగ్గరుండి పర్యవేక్షించారు. తరచు డ్రెయిన్ క్లీనింగ్ ద్వారా పరిశుభ్రతకు దోహదపడాలని కోరారు.

# అంగన్వాడీ కార్యకర్తలకు అందుబాటులో స్మార్ట్ ఫోన్‌లు ..

- గర్భిణీ ,బాలింతలు , చిన్నారుల వివరాలు ఇక ఆన్ లైన్ లోనే ..
- అంగన్వాడీ కేంద్రాల పనితీరు పై నేరుగా డ్యాష్ బోర్డు అధికారుల పర్యవేక్షణలోనే ..

విశాఖపట్నం : అంగన్వాడీ కార్యకర్తలకు అందుబాటులో స్మార్ట్ ఫోన్ లు అందించడం జరిగిందని అర్బన్ -1 సి.డి.పి.ఒ బి.పద్మావతి అన్నారు . ఈమేరకు ఆర్ .అండ్ .బి కూడలి వద్ద న గల స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యలయంలో బుదవారం ఉదయం అంగన్వాడీ కార్యకర్తలకు సి.ఎ .ఎస్ కమాన్ అప్లికేషన్ సాఫ్ట్ వేర్ పై అవగహన కల్పించారు . ఈసందర్బంగా ఆమే మాట్లడుతూ గర్భిణీ ,బాలింతలు , చిన్నారుల వివరాలు ఇక ఆన్ లైన్ లోనే పొందుపరచడం జరుగుతుందన్నారు .2016 మే నెలలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రారంబించిన కార్యక్రమం 8 రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతుందన్నారు . లబ్ధిదారులు గర్బిణి లు , బాలింతలు , 0 నుండి 6 సంవత్సరాలలోపు పిల్లలు వారి యెక్క వివరాలు వారికి ఎప్పటికపుడు అందిస్తున్న ప్రోటీన్స్ , ఇమినైజేషన్ తదితర వివరాలు ఆన్ లైన్ ద్వరా అప్ డేట్ చెయడం జరుగుతుందన్నారు . అదేవిదంగా సమయానికి అంగన్వాడీ కార్యకర్త కేంద్రాల్లో వున్నారా లేదా అన్న విషయాన్ని జి.పి.అర్.ఎస్ ద్వార డ్యాష్ బోర్డ్ ముఖ్య అదికారులు గుర్తిస్తారన్నారు .

కేంద్రాలలో మునుపు 11 రిజిస్టర్లు ఉండేవని ఆన్ లైన్ ప్రక్రియ అందుబాటులోకి రావడంతో 8 రిజిస్టర్లు స్మార్ట్ ఫోన్ లో అప్లోడ్ చేసి కార్యకర్తలకు అందించడం జరిగిందన్నారు . అందులో కుటుంబ నిర్వహణ , గృహ సందర్శన ప్రణాళిక , రోజువారీ న్యూట్రిషన్ , పిల్లల పెరుగుదల పర్యవేక్షణ , టి .హిచ్ .ఆర్ ద్వరా హోమ్ రెషన్ అందించడం , డ్యూ లిస్ట్ ,అంగన్వాడీ సెంటర్ నిర్వహణ , ఎం .పి.ఆర్ స్మార్ట్ ఫోన్ లో పొందుపరచటం జరిగిందన్నారు .

దీనిపై కార్యకర్తలకు పూర్తి స్థాయిలో అవాహన కల్పిస్తున్నామని అన్నారు .కార్యక్రమంలో సూపర్ వైజర్లు మనసా , రాజేశ్వరి , తెల్మా , నిర్మలాకుమారి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గున్నారు .

# ఉపాధ్యాయలు నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చాలి

- ఆర్.పి.పేట ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల సందర్శన
- డిజిటల్ తరగతుల పరిశీలన
- మధ్యాహ్నా భోజనం మరింత బాగా ఉండేటట్లు చర్యలు
- అన్ని టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచాలి
- యస్.యస్.సి తరగతులను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి
- ఫర్నిచర్‌ను అన్ని తరగతులకు సరఫరా చేయాలి
- అడ్వాన్స్ ఫౌండేషన్ తరగతులను పరిశీలించినకమిషనర్
- స్వచ్ఛ విద్యాలయ ప్రాజెక్టు పరిశీలించి సక్రమ నిర్వహణపై శ్రద్ధవహించాలి
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: ఉపాధ్యాయులు నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కంచరపాలెం ఆర్.పి.పేట ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిజిటల్ తరగతుల నిర్వహణ తీరును పరిశీలించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం పరిశీలించి మరింత బాగా ఉండేటట్లు చూడాలని కోరారు. అనంతరం మరుగుదొడ్లను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. యస్.యస్.సి తరగతులను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని కోరారు.

అన్ని తరగతి గదులకు ఫర్నిచర్‌ను అమర్చాలని పేర్కొన్నారు. ఏమైనా చిన్న చిన్న మరమ్మత్తులుంటే సత్వరం పూర్తి చేయాలని కోరారు. అనంతరం అడ్వాన్స్ ఫౌండేషన్ తరగతులను సందర్శించారు. స్వచ్ఛ విద్యాలయ ప్రాజెక్టు పరిశీలించి మరింత సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

పర్యటనలో అదనపు కమిషనర్ 9ఫైనాన్స్) ఎస్.ఎస్ వర్మ, అసిస్టెంట్ కలెక్టర్ మీషాసింగ్, డిప్యూటి డిఇఓ బి.లక్ష్మినరస, యస్.ఇ రాజు, ఇ.ఇ చిరంజీవి, ఏ.ఇ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### భీమిలికి చెందిన వెటరన్ అథ్లెటిక్స్ ప్రతిభ

భీమునిపట్నం: గుంటూరు జిల్లా భాపట్ల లో జరిగిన 37వ అథ్లెటిక్స్ పోటీలలో భీమిలికి చెందిన వెటరన్ అథ్లెటిక్స్ ప్రతిభను చూపారు ఇందులో తట్టికోట. .భీమారావు 1500 మీటర్ల పరుగు పందెం,లాంగ్ జంపు ,ట్రిపుల్ జంపు పోటిల్లో ద్వితీయ స్థానం పొంది వెండి పథకాలు సాదించారు.

# ‘ప్రత్యేక’ పోరుమాని విదేశాల్లో విలాసాలా!?



విశాఖపట్నం: ప్రత్యేక హోదా సాధిస్తామని ప్రజలను నమ్మించి ఆ తరువాత వంచించి అధికార పీఠాన్ని కైవశం చేసుకుని అందలాలెక్కిన చంద్రబాబు నాయుడు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉన్నానని చెప్పి ప్రజలను మోసగించడం ఎంతమాత్రం తగదని వైకాపా యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం వైకాపా విద్యార్థి విభాగం నుంచి అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి జివిఎంసి కార్యాలయం ఎదురుగా గల గాంధీ విగ్రహం వరకు భారీఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో జక్కంపూడి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు పరిశ్రమలు, పెట్టుబడుల పేరు చెప్పి విదేశాల్లో తిరుగుతూ పెట్టుబడులు తేలేదు సరికదా ఆ విదేశాల ఖర్చంతా ప్రజల నెత్తిన వేస్తారని విమర్శించారు. యువతను ప్రలోభాలకు గురిచేసి నిరుద్యోగ భృతి ఇస్తానని మాటమాటలు చెప్పి అధికారాన్ని చేజిక్కించుకున్నారని, ఇప్పటి వరకు యువతకు ఉద్యోగాలు లేవు సరికదా నిరుద్యోగాన్ని మరింతగా పెంచి పోషించారని విమర్శించారు. ప్రత్యేక హోదా తెప్పిస్తామని రాష్ట్ర విభజన సమయంలో దొంగమాటలు చెప్పి ప్రత్యేక ప్యాకేజీకి తొత్తుగా మారిపోయిన బాబు దొంగబాబు అని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి యువత గట్టిగా బుద్ధి చెప్పాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర వైకాపా అధ్యక్షుడు మళ్ల విజయప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల వంశీకృష్ణ యాదవ్, కోలా గురువులు, సనపలచంద్రమౌళి, తిప్పల నాగిరెడ్డి, కల్యాణి, మహిళా నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్, విజయనిర్మల, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండారాజీవ్, నాయకులు పీతల మూర్తి యాదవ్, తుల్లి చంద్రశేఖర్, కట్టుమూరి సతీష్, కాంతారావు, మాసిపోగు రాజు, ఆళ్ల శివగణేష్, తిప్పల వంశీ, బోని శివరామకృష్ణ, పీలా వెంకట లక్ష్మి, మహ్మద్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య ప్రాంతంలో వున్న గురుకుల పాఠశాలను తరలించాలి

భీమునిపట్నం: మండలం అన్నవరం పంచాయితీలో ఇటీవల మంజూరు చేయబడిన మహాత్మాగాంధీ జ్యోతీబాపులే అంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతులు సంక్షేమ గురుకుల పాఠశాలను దివీస్ కాలుష్యం ఆప్రాంతం వద్ద వద్దని గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో ఇక్కడ వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం ఉండేదని దివీస్ కాలుష్యం కారణంగా మూసివేసారని గ్రామస్తులు వాపోతున్నారు.

ఈ కాలుష్య ప్రాంతంలో కాకుండా పర్యావరణమునకు అనుకూలంగా ఉన్న చోటుకు పాఠశాలను తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు .

### ప్రత్యేక హోదా ధర్నాకు వెళ్తున్న

## భీమిలి వై.సి.పి.విద్యార్థి విభాగం

భీమునిపట్నం: రాష్ట్రానికి ప్రత్యేక హోదాను పోరాటం ద్వారానే సాధించు కోవాలని వై.సి.పి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆర్ .ప్రభాకరనాయుడు అన్నారు .

హోదా వల్ల ఎన్నో ప్రయోజనాలు జరుగుతున్నాయని దీన్ని దృష్టిలో వుంచు కొని రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం విశాఖ జీ.వీ.ఎం.సి. కార్యాలయం ఎదురుగా మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వై.ఎస్.ఆర్ యుజన విభాగం చేపట్టనున్న ర్యాలీకి భీమిలి వై.సి.పి విభాగం నుంచి వై.సి.పి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆర్ .ప్రభాకరనాయుడు మరియు 17వ వార్డు యూత్ అద్యక్షుడు ఎల్.సంతోష్ ఆద్వర్యంలో సుమారు 50 మందితో విశాఖపట్నం బయలుదేరి వెళ్ళారు.

# విజయభాను సంపాదకీయం

## పతన రాజకీయం

రాజకీయ పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలు ఎలా ఉన్నా గుజరాత్ మాత్రం గతంలో ఉన్నట్టు లేదు. గోధ్రా నాటి పరిస్థితి మారిపోయింది. గోధ్రా ఘటనతో గుజరాత్ మాత్రమే కాదు, దేశమే తీవ్రం గా ప్రభావితమై బీజేపీకి జీవం పోస్తే గోధ్రా స్థానం మాత్రం మొదటినుంచీ కాంగ్రెస్ చేతిలోనే ఉన్నది. అప్పటినుంచి ఇప్పటిదాకా అక్కడ బీజేపీ గెలువలేదు. అంతేగాక గోధ్రా పంచ్‌మహల్ లోక్‌సభా నియోజకవర్గ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలలో ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. ఇక మోదీ చెబుతున్న అభివృద్ధి వెలుగు జిలుగులు ప్రజలందరికి చేరని స్థితి ఉన్నది. ప్రధాన నగరాలు, వాటిని అనుసంధానం చేసే రోడ్లు మాత్రమే వెలిగిపోతున్నాయి కానీ, గ్రామీణ ప్రాంతం కనీస అభివృద్ధికి నోచుకోలేదు. గుజరాత్ ఎన్నికల సందర్భంగా పార్టీల ప్రచార తీరు ప్రజాస్వామ్యానికే మచ్చ తెచ్చేవిధంగా ఉంటున్నది. రాజకీయ విధానాలు, అభివృద్ధి ప్రణాళికలు ప్రచారాస్త్రంగా పనికిరాకుండా పోయాయి. వ్యక్తిగత నిందారోపణలు, అడ్డుతొలిగించుకునే కుట్రలు, సుపారీలు, విదేశీజోక్యా లు ప్రచారాస్త్రాలు కావటమే విషాదం. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎన్నికలను విదేశీ శక్తులు ప్రభావితం చేసే స్థితి ఉన్నదని చెప్పుకోవటమే డొల్లతనం. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యవ్యవస్థగా చెప్పుకుంటున్న దేశంలో ఎన్నికల్లో బయటిశక్తుల ప్రమేయం ఉన్నద ని, ఉంటుందని చెప్పుకోవడం నాయకుల దుర్బలత్వానికి ప్రతీక. ఇలాంటి తీవ్ర ఆరోపణలు ప్రధానిగా ఉన్న వారి నోటి నుంచి రావటమే ఇప్పటి విషాదం. మొదటి దశ పోలింగ్ ప్రారంభమయ్యే రెండు రోజుల ముందు దాకా రాజకీయ విధానాలు, అభివృద్ధి చుట్టూ తిరిగిన ఎన్నికల ప్రచారం పరిధి దాటి ఒక్కసారిగా వ్యక్తిగత నిందలు, విదేశీ జోక్యం ఆరోపణల దాకా పోవడం నేతల మానసిక కుంగుబాటుకు నిదర్శనం. గుజరాత్‌లో గతంలో జరిగిన ఎన్నికలకు ఇప్పటి ఎన్నికలకు చాలా తేడా ఉన్నది. 2002లో గోధ్రా ఘటన తర్వాత అఖండ మెజారిటీ తో మోదీ నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ మెజారిటీ వాదాన్నీ, అయోధ్య వివాదాన్నీ, అభివృద్ధినీ ప్రధాన ప్రచారాస్త్రాలుగా చేసుకుని గెలుపు బావుటాలు ఎగరేసింది. ఈసారి మాత్రం పాత నినాదాలు పనిచేయనివై పోయాయి. అచ్చే దిన్ ఆయేగీ, స్వచ్ఛభారత్, అవినీతి నిర్మూలన, నల్లధనం వెలికితీత, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ లాంటివేవీ ఇవాళ బీజేపీ ప్రచారానికి ఉపయోగపడటం లేదనేది గమనార్హం. మొదటి విడత పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ బీజేపీకి కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఎదురవుతున్నదనే సూచనలు వెలువడ్డాయి. మొదటిదశలో పోలింగ్ జరిగిన ప్రాంతాలన్నీ బీజేపీకి కంచుకోటలే. అవి ఇప్పుడు పెద్ద ప్రభావశీల వర్గంగా ఉన్న పటేల్ వర్గమంతా రిజర్వేషన్ కోటా ఉద్యమం కారణంగా బీజేపీకి దూరమయ్యింది. ఎన్నికల సందర్భంగా పటీదార్ ఉద్యమనేత హార్దిక్ పటేల్‌పై బీజేపీ నేతలు అశ్లీల వీడియోలతో చేసి న అనైతిక దుష్ప్రచారం పటేళ్లను మరింత ఆగ్రహానికి గురిచేసింది. ఇవ్వాళ పటేళ్లంతా బీజేపీకి వ్యతిరేకంగా నిలుస్తారేమోనన్న బెంగ ఒకవైపు ఉంటే, దళిత సామాజికవర్గాలకు ప్రతినిధిగా ముందుకు వచ్చిన జిగ్నేశ్ మేవానీ, ఓబీసీ వర్గాల యువనేత అల్పేశ్ ఠాకూర్ ఏకంగా కాంగ్రెస్‌లో చేరటంతో బీజేపీకి తమ ఓటు బ్యాంకు కుప్పకూలిందన్న భయం పట్టుకున్నది. ఓటమి భయంతోనే మోదీ విష ప్రచారానికి దిగారని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. తనకు వ్యతిరేకంగా మణిశంకర్ అయ్యర్ ఇంట్లో కుట్ర జరిగిందని ప్రధాని మోదీ ఆరోపిస్తున్నారు. కానీ అయ్యర్ ఇంట్లో జరిగిన విందు సమావేశా ని కి ఒక మాజీ ప్రధాని, మాజీ ఉపరాష్ట్రపతి, మాజీ ఆర్మీ చీఫ్, మాజీ రాయబారులు, సీనియర్ దౌత్యవేత్తలు హాజరయ్యారు. ఇలాంటి సమావేశాన్ని కుట్రగా ప్రచారం చేయటం మోదీ దిగజారుడు త నానికి నిదర్శనంగా కాంగ్రెస్ ఆరోపిన్నది. నిజంగానే బయటిశక్తుల ప్రోద్బలంతో కుట్రనే జరిగితే తమకున్న నిఘాసంస్థల సమాచారంతో నిర్బంధించవ చ్చు కదా అని నిలదీస్తున్నది. ఈ క్రమంలోనే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మోదీ జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయటంలో అర్థమున్నది. రాజకీయ పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలు ఎలా ఉన్నా గుజరాత్ మాత్రం గతంలో ఉన్నట్టు లేదు. గోధ్రా నాటి పరిస్థితి మారిపోయింది. గోధ్రా ఘటనతో గుజరాత్ మాత్రమే కాదు, దేశమే తీవ్రం గా ప్రభావితమై బీజేపీకి జీవం పోస్తే గోధ్రా స్థానం మాత్రం మొదటినుంచీ కాంగ్రెస్ చేతిలోనే ఉన్నది. అప్పటి నుంచి ఇప్పటిదాకా అక్కడ బీజేపీ గెలువలేదు. అంతేగాక గోధ్రా పంచ్‌మహల్ లోక్‌సభా నియోజక వర్గ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలలో ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. ఇక మోదీ చెబుతున్న అభివృద్ధి వెలుగు జిలుగులు ప్రజలందరికి చేరని స్థితి ఉన్నది.

## విశాల్ పోటీ చేయడం తప్పుకాదు: శరత్‌కుమార్



చెన్నై : నటుడు శరత్‌కుమార్ తన పేరుతో 'ఏఎస్‌కే' సరికొత్త యాప్‌ను ఆవిష్కరించారు. చెన్నైలో జరిగిన ఈ కార్యక్రమంలో రాధిక, నటి వరలక్ష్మి, రాధిక కుమార్తె రయాన్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలతో మమేకమయ్యేలా ఈ యాప్‌ను రూపొందించారు. ఈ సందర్భేగా శరత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పోటీ చేయవచ్చు.

విశాల్ పోటీ చేయడంలో ఎలాంటి తప్పు లేదు. అయితే ఆయన నామినేషన్‌ను తిరస్కరించిన అంశాన్ని ఇంత పెద్ద సమస్యగా చేయాల్సిన అవసరం లేదు. ఎంజీఆర్ నామినేషన్ కూడా తిరస్కరణకు గురైన సందరాేలు ఉన్నాయి. నటీనటుల సంఘంలో ఐక్యత లోపించిన విషయం స్పష్టమవుతోంది. అందరూ ఏకతాటిపైకి వచ్చి పనులన్నీ సక్రమంగా నిర్వర్తించాలని కోరారు.

## ఘనంగా భారతీయార్ జయంతి

చెన్నై : మహాకవి భారతీయార్ 136వ జయంతి వేడుకలు తిరుచ్చి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. భారతీయార్ అందించిన సేవలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. అనేక మంది పాఠశాలల విద్యార్థులు భారతీయార్ వేషధారణలో పాల్గొని పలు సాంస్క ృతిక కార్యక్రమాలు ప్రదర్శన చేపట్టారు. అలాగే పుదుక్కోట్టై సంతపేట్టైలో ఉన్న మున్సిపల్ మాధ్యమిక పాఠశాల విద్యార్థులు ఆయన వేషధారణతో పద్యాలు చెప్పి, నాటకాన్ని ప్రదర్శించారు. ఆయన జన్మస్థలమైన ఎట్టయపురంలో కూడా వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యార్థులు ఆయన ఇంటి వరకు నడిచి వెళ్లి శిలావిగ్రహానికి పూలమాలలు సమర్పించి అంజలి ఘటించారు. విద్యార్థుల ర్యాలీని ఎట్టయ్యపురం పోలీసు ఇన్‌స్పెక్టరు రామయ్య జెండా ఊపి ప్రారంభించారు. 'ఆలిండియా తమిళ్ రైటర్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో సాహితీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అధ్యక్షుడు యు.కాజామైదీన్, మాజీ అధ్యక్షుడు ఆర్.గోవిందరాజ పెరుమాళ్ తదితరులు హాజరయ్యారు.

## యువకులే పార్టీకి మూలస్తంభాలు: కృష్ణ



పర్లాఖెముండి : రాష్ట్రంలో బిజద అత్యంత శక్తిమంతమైన రాజకీయ పార్టీగా కొనసాగుతోందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పనిచేస్తున్నారని గజపతి జిల్లా యువ బిజద అధ్యక్షుడు పి.కృష్ణ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో యువ బిజద నూతన కార్యవర్గంతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బిజద బలం నానాటికీ పెరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రదీప్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే కె.నారాయణరావు, సమితి అధ్యక్షుడు చిత్రి సింహాద్రి, చాపర తారకేశ్వరి, జిల్లా పరిషత్తు సభ్యుడు గేదెల శ్రీథర్, బిమలా శ్యామల్, దారపురవి, బప్పి, లక్ష్మిపొరిచ్చా, ఆర్.ఎన్.మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఇదే..

అధ్యక్షునిగా పి.కృష్ణ, ఉపాధ్యక్షులుగా కేలు కేశవరావు, సూర్యనారాయణ రాజగురు, మోయిబ్‌పాణి, నెహిమియాన్ సువాల్‌సింగ్, శివరాం సాహు, ప్రధాన కార్యదర్శిలుగా మగ్గి అప్పన్న, బైరి సాయికృష్ణ, ఉత్తమ్ కుమార్ పాణి, లక్ష్మినారాయణ సవర, పావుల సవర, కార్యదర్శులుగా రాజకుమార్ పాత్ర, రమేష్ ప్రధాన్, కళింగకార్తికేశ్వర నాయక్, సంజెయ్ సవర, మమతాజ్ మహమద్, అంతర్యామి పాఢి, ఆదర్స్ ప్రధాన్, పిరోజ్‌కుమార్ పట్నాయక్, దారపు హరీష్‌కుమార్, రవినారాయణ పండా, ప్రచార విభాగానికి సందీప్‌బక్షి, నియోజకవర్గ మండలి అధ్యక్షులుగా గేదెల శ్రీథర్(పర్లాఖముండి), బూరెల శంకరరావు నియమితులయ్యారు. జిల్లాలోని సమితులవారీగా బి.త్రిలోచనరావు (కాశీనగర్), టి.నరేష్ (గుసాని), మునతి సవర (గుమ్మ), సుశాంత్‌కుమార గొమాంగో (రాయగడ), చంద్ర ఇడాల్ (నువాగడ), రాజేంద్రప్రసాద్ రణసింగ్‌నాయక్ (ఆర్.ఉదయగిరి), రామకృష్ణ సాహు (మోహన), మీనకేతన్ బొరాలో (పర్లాఖెముండి పట్టణం), రఘురాం సాహు (కాశీనగర్, ఎన్.ఎ.సి.)లు అధ్యక్షులుగా ఎంపికయ్యారు. ఈ కార్యవర్గం ఏర్పాటుకు సహకరించిన యువ బిజద రాష్ట్ర నాయకులకు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే జాలర్ల మృతి

### పీఎంకే నేత అన్బుమణి ఆరోపణ

చెన్నై : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే జాలర్లు మృతి చెందారని పీఎంకే యువజన విభాగ అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ పేర్కొన్నారు. విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... కన్యాకుమారి నుంచి చేపల వేటకు వెళ్లిన వారిలో 98 మంది జాలర్లు మృత్యువాత పడినట్లు ఆ సంఘం నేతలు ప్రకటించారని... వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దక్షణ ఆసియా జాలర్ల సంఘ ప్రధాన కార్యదర్శి, కన్యాకుమరి జిల్లా క్రైస్తవ మతబోధకులు చర్చిల్ సేకరించిన సమాచారం మేరకు నీరోడి గ్రామంలో 37 మంది, చిన్నతురై గ్రామంలో 22 మంది గల్లంతైనట్లు తెలిపారు. కులచ్చల్‌కు చెందిన 13 మంది, ఇరైవిపుత్తన్ పుదూర్‌లో 7 మంది, మిగతా గ్రామాల్లో 19 మంది జాలర్లు మ ృతి చెందినట్లు సమాచారం అందిందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో చేపల వేటకు వెళ్లిన జాలర్లకు రక్షణ కల్పించలేని పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. భారత కోస్ట్‌గార్డ్, భారత నావికాదళం సరైన సమయంలో స్పందించి ఉంటే జాలర్లను కాపాడి ఉండవచ్చని తెలిపారు. ఇంకా మరో 500 మంది ఆచూకీ తెలియలేదని, మృతి చెందిన జాలర్ల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం అందజేయాలని అన్బుమణి డిమాండు చేశారు.

## కవి సమయం

### దేవ దేవుని అవతరాలు- ప్రాముఖ్యత

మొదటి అవతారం : శ్రీ మన్నారాయణుని దివ్యరూపం
దానిని కేవలం పరమ యోగీంద్రులు మాత్రమే దర్శిస్తారు. ఆయన నాభి కమలం నుండి బ్రహ్మ జన్మించాడు. అతని అవయవాల్లో (బ్రహ్మ) లోకాలు కల్పింపబడ్డాయి.
రెండవ అవతారం : వరహావతారం : జగత్ సృష్టి కోసం పాతళంలోని భూమి నెత్తుతూ యచ్ఛేశుడై వరహారూపం ధరించాడు.
3వ అవతారం : నారదుడనే దేవర్షియై కర్మనిర్మోచకమయిన వైష్ణవతంత్రం చెప్పాడు.
4వ అవతారం : యీ అవతారం ధర్ముని పత్ని అయిన 'మూర్తి'కి నర నారాయణ మహర్షులుగా అవతరించారు.
5వ అవతారం : సిద్ధేశ్వరుడయిన కపిలుడు, అసురి అనే బ్రాహ్మణునకు, తత్వ సమూహాన్ని గురించి నిర్ణయం కల సాంఖ్యం ఉపదేశించాడు.
6వ అవతారం : అనసూయ యందు అత్రికి కుమారుడై అలర్కునికి, ప్రహ్లాదుడు మొ॥గు వారికి ఆత్మవిద్య బోధించాడు.
7వఅవతారంలో ఆకూతి యందు కుచికి జన్మించి యజ్ఞుడనే పేరుతో ప్రసిద్ధుడై దేవతలతో కలసి స్వాయంభువ మన్వంతరం రక్షించాడు.
8వ అవతారంలో మేరుదేవిని నాభికి జన్మించి ఉరుక్రిముడనే పేరుతో ప్రసిద్ధుడై విద్వాంసులకు పరమ హంస మార్గం ప్రకటించాడు.
9వ అవతారంలో మహర్షుల ప్రార్థనలతో పృథుచక్రవర్తియై భూమిని ధేనువుగా చేసే సమస్త వస్తువులు సిరికాడు.
10వ అవతారంలో సముద్రాన్ని మధించేటప్పుడు తాబేలు రూపం ధరించి, మంద ర పర్వతాన్ని నేర్పుగా తన వీపు మీద నిలిపారు.

...కవితా రచన
శ్రీస్వామి అప్పాజి భగవాన్
సెల్ నెం: 98486 44336

## పంచాంగం

| మాసం : మార్గశిర; తిథి : ద్వాదశి తె.6.05; స్వాతి రా.12.50; ఉ.శే.వ.7.14వ | గురువారం 14-12-2017 |
|---|---|

**మేషం** : బంధువుల రాకవల్ల ఊహించని ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాలలో ప్లీడర్ల ధోరణి ఆందోళన కలిగిస్తుంది. కాంట్రాక్టర్లు పనివారలవల్ల సమస్యలకు, ఇబ్బందికి లోనవుతారు. చేపట్టిన పనిలో కొంత ముందు వెనుకలుగానైనా సంతృప్తి కానరా గలదు. సహోద్యోగులతో అభిప్రాయ బేధాలు తలెత్తే ఆస్కారం ఉంది,

**వృషభం** : జీవితబీమా, ఫిక్సిడ్ డిపాజిట్లకు సంబంధించిన సొమ్ము చేతి కందుతుంది. వ్యాపారాల్లో ఆటంకాలను అధిగమించటంతో పాటు అను భవం గడిస్తారు. విద్యార్థులకు తోటివారితో సఖ్యత నెలకొంటుంది. దూరప్రయాణాల్లో చికాకులు తప్పవు.

**మిథునం** : వస్త్ర, బంగారం, వెండి రంగాలలో వారికి కలిసిరాగలదు. కంపెనీల ప్రభుత్వ సంస్థలతో లావాదేవీలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. జాగ్రత్త వహించండి. శెనగలు, వక్కలు, కాఫీపొడి, నూనె, ఎండుమిర్చి, చింతపండు వ్యాపారస్తులకు దినదినాభివృద్ధి పొందుతారు. మీ శ్రీమతి సలహా పాటించడం మంచిది.

**కర్కాటకం** : ఉద్యోగ వ్యాపారాల్లో పురోభివృద్ధి సాధిస్తారు. విధినిర్వణలో దొర్లిన తప్పిదాల వల్ల పత్రికా సంస్థలలో వారికి మనస్థిమితం అంతగా ఉండదు. ఫైనాన్సు, చిట్‌ఫండ్ వ్యాపారస్తులకు సంతృప్తి కానరాగలదు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులు అనుకూలిస్తాయి.

**సింహం** : కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ అధికారుల నుంచి అభ్యంతరాలెదుర్కోవలసి వస్తుంది. సంగీత కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. కోర్టు వ్యవహారాలు వాయిదాపడటంతో నిరుత్సాహం చెందుతారు. ప్రత్యర్థులపై విజయం సాధిస్తారు. తలపెట్టిన పనులు ఎంతకీ పూర్తికాక విసుగు కలిగిస్తాయి. ఆలయాలను సందర్శిస్తారు.

**కన్య** : ఒక స్థిరాస్తిని అమర్చుకోవాలనే కోరిక స్ఫురిస్తుంది. మీ అలవాట్లు, బలహీనతలు గోప్యంగా ఉంచండి. ఆదాయ వ్యయాల్లో ఏకాగ్రత అవసరం. కుటుంబ, సొత ఖర్చులు అధికంగా ఉంటాయి. కొబ్బరి, పండ్లు, పూలు, కూరగాయల వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్య విషయంలో మెళకువ అవసరం.

**తుల** : వృత్తిపరమైన చికాకులను అధిగమిస్తారు. శకునాల ప్రభావం వల్ల కొన్ని వ్యవహారాలు, పనులు వాయిదా వేసుకుంటారు. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు మంచి స్పందన లభిస్తుంది.

**వృశ్చికం** : బ్యాంకు వ్యవహారాలలోనూ, ప్రయాణాలలోను వస్తువుల పట్ల మెళకువ అవసరం. స్త్రీలకు పనివారలతో చికాకులను ఎదు ర్కుంటారు. చిన్నతరహా పరిశ్రమలలో వారికి అభివృద్ధి కానవస్తుంది.

**ధనుస్సు** : స్త్రీలు పరిచయం లేని వ్యక్తులను దూరంగా ఉంచడం మంచిది. పెద్దల ఆరోగ్యం మెరుగు పడుతుంది.

**మకరం** : బంధువులతో తెగిపోయిన సంబంధాలు తిరిగి బల పడుతాయి. విద్యార్థులకు నూతన పరిచయాలు ఏర్పడుతాయి. ఉపాధ్యా యులతో విద్యార్థులు ఏకీభవించ లేకపోతారు. చేపట్టిన పనులు కొంత ముందు వెనుకలుగానైనా పూర్తి చేస్తారు.

**కుంభం** : వస్త్రాలు, ఆభరణాలు, విలువైన వస్తువులు అమర్చుకోవాలనే స్త్రీల కోరిక నెరవేరుతుంది. మీ లక్ష్య సాధనకు నిరంతర కృషి అవసరం. శత్రువులు మిత్రులుగా మారుతారు.

**మీనం** : ఓర్పు, నేర్పుతో అనుకున్నది సాధిస్తారు. బంధువుల రాక వల్ల గృహంలో కొత్త ఉత్సాహం, సందడి చోటు చేసుకుంటుంది. కుటుంబీకుల మధ్య ఆసక్తికరమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి.

# సాయిబాబా చిన్న కథలు

## సంకీర్తన



### దేవుడే దిక్కు

"అమ్మా! నీవు చెప్పినట్లు నారాయణగారికి ఉత్తరం రాశాను. ఆయనే పంపించాడు ఈ డబ్బు. పద! పోస్టుమాస్టరును అడుగు" అని ఆ అబ్బాయి అన్నాడు. పిల్లవానిని బయటే నిలబెట్టి, ఆమె లోనికి వెళ్లింది. తల్లి పోస్టుమాస్టారుతో "అయ్యా! ఈపిల్లవాడు చెప్తున్నదంతా నిజమేనా!" అని అడిగింది. పోస్టుమాస్టర్ అమెతో "అవునమ్మా! భగవంతుడే పంపించాడు! మొన్నటి దినం ఈ పిల్లవాడు రాసిన ఉత్తరం చూసి నా హృదయం కరిగింది. నా మనస్సులో భగవంతుడు ప్రవేశించి, నా చేత ఈ డబ్బు ఇప్పించాడు. అమ్మా! దయచేసి ఈ డబ్బు వాపసు ఇవ్వకండి. ఆ పసివాని విశ్వాసం దెబ్బతింటుంది. నిర్మల హృదయులైన పిల్లలు ప్రార్థిస్తే, భగవంతుడు ఆ ప్రార్థనను తప్పక ఆలకిస్తాడు. ఏదో ఒక విధంగా ఆదుకుంటాడు. నేను నిమిత్తమాత్రుణ్ణి" అన్నాడు.

ఈ కథ నుండి మనం తెలుసుకోగలిగింది ఏమిటి? నిర్మల హృదయంతో, సంపూర్ణ విశ్వాసంతో ప్రార్థిస్తే భగవంతుడు ఏదో ఒక రూపంలో మనం కోరిన దానిని అందిస్తాడు.

### ప్రథమ బడి

ఒక ఊరిలో ఒక పేద స్త్రీ కూరగాయల మార్కెట్టునకు పోయి, కూరగాయలు కొని వీధులలో అమ్ముకొని జివించేది. ఆమె ప్రతీ దినము మార్కెట్టుకు కూరలు కొనడానికి ఖాళీ బుట్టను తీసుకుని వెళ్ళేది. చంకలో తన చిన్న కూతురిని ఎత్తుకుని పోయేది. ఆమెకు యింటివద్ద పిల్లవానిని చూసేవారు ఎవరూ లేరు. ఒకనాడు ఈ విధంగా మార్కెట్టుకు వెళ్లే సమయంలో ఒక అరటిపండ్లు అమ్ముకొనే స్త్రీ వీరి ప్రక్కనుండి వెళ్ళడం యీ పిల్లవాడు చూశాడు. ఆమె నెత్తి మీద గల బుట్ట నుండి బయటకు వ్రాలి వున్న ఒక పండును లాగి, తినటం ప్రారంభించాడు. ఆ పిల్లవాడి తల్లి పిల్లవాని చర్యను చూసి కూడా ఏమీ అనలేదు. నాలుగు సంవత్సరాల వయస్సుగల ఆ పిల్లవాడు ఎంత సామర్థ్యముతో ఆ పండును తాను సంగ్రహించాడో గొప్పగా చెబుతున్నాడు. తల్లి కూడా కుమారుని తెలివికి పొంగిపోయింది. ఈ దొంగ బుద్ధి ఆ పిల్ల వానిలో అభివృద్ధి అయినది. చిన్న చిన్న వస్తువులను చాకచక్యంతో దొంగిలించడం మొదలు పెట్టాడు. తల్లి ఏమాత్రమూ మందలించలేదు. అసలు ఈ విషయము పట్టించుకొనలేదు. పెరిగి పెద్దవాడయిన ఆమె కుమారుడు ఒక ఘరానా



దొంగగా మారాడు. ఒక సారి దోపిడీ ముఠాతో వెళ్లి, దోచుకుంటున్న సమయంలో ఒక వ్యక్తిని హత్య చేశాడు. పోలీసులు పట్టుకుని చెరసాలలో బంధించారు. తల్లి కుమారుని దుస్థితికి ఎంతగానో ఏడ్చింది. చెరసాలలో వున్న కుమారుడు తన తల్లిని ఒక సారి చూడాలని వుందని, ఆమెతో మాట్లాడాలని వుందని జైలు అధికారులను కోరాడు.

...సశేషం

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ స్కూల్ బస్సు

పెదపూడి:తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక ఊలపల్లి మధ్య ప్రైవేట్ స్కూల్ బస్సుకు ఘోర పెను ప్రమాదం తప్పింది సుమారు 50మంది విద్యార్థులతో వెళుతున్న ప్రైవేట్ స్కూల్ బస్సు స్టీరింగ్ విరిగి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది ఈ ప్రమాదం **విద్యార్థులకు స్వల్ప గాయాలు** నుంచి విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు గాయాలైన విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు

### కోర్టు ధిక్కారం కేసులో

## గోవాడ షుగర్స్ ఎండీకి నాన్ బెయిల్ వారెంట్...!!!

**- హుదూదు తుఫాను అనంతరం జరిగిన కోట్లాది రూపాయిల కుంభకోణంపై దర్యాప్తు..**

చోడవరం: కోర్టు ధిక్కారం కేసులో గోవాడ షుగర్స్ ఎం.డి.కి బుధవారం నాన్ బెయిల్‌బుల్ (ఎన్.బి.డబ్ల్యూ) అరెష్టు వారెంట్ జారీ అయినట్లు బోగట్టా. 2014 హుదూదు తుఫాను అనంతరం ఫ్యాక్టరీలో తడిసిన పంచదార అమ్మకాలు తదితర విషయాల్లో జరిగిన కోట్లాది రూపాయిల అవకతవకలపైన, గ్రీన్ మింట్ ఇండియాకు జరిగిన మోసంపైన ఆ సంస్థ యాజమాన్యం హైకోర్టు, పోలీసులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి వారు పట్టించుకోపోవడంతో, గ్రీన్ మింట్ ఇండియా ఎం.డి. భూతనాదు మురళీ దొర హైకోర్టును ఆశ్రయించడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో క్రైం రిపోర్టు 14, 127/2016తో గోవాడ షుగర్స్ ఎం.డి., పాలకవర్గ ఛైర్మన్, జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ అధికారులు, సర్వేయిర్లతో కలిపి మొత్తం 18 మందిపై సి.ఆర్.పి.సి, సి.సి 769, 770 సెక్షన్లతో మొత్తం 18 మందిపై పోలీసులు కేసు నమోదు చేసారు. దీనిపై 419, 420, 468, 471, 406, 409 రెడు విత్ 34 ఐ.సి.సి, 120బి లతో స్థానిక న్యాయస్థానం విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో పై కేసుల్లో విచారణకు సహకరించవలసిందిగా ప్రస్తుత ఎం.డికు న్యాయస్థానం సమన్లు జారీ చేసింది.

దీనిపై అక్టోబరు 30న జరిగిన కోర్టు వాయిదాకు ఎం.డి. హాజరుకాలేకపోయారు. దీంతో కోర్టు ధిక్కారణ క్రింద ఫష్టు క్లాస్ మేజిస్ట్రేటు వారు ఎం.డి.కు బుధవారం నాన్ బెయిల్‌బుల్ (ఎన్.బి.డబ్ల్యూ) అరెష్టు వారెంట్ జారీ చేసినట్లు ఫిర్యాది దారుడు, గ్రీన్ మింట్ ఇండియా ఎం.డి. భూతనాదు మురళీ దొర స్థానిక విలేఖరులకు తెలియజేసారు. దీనిపై ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచినట్లు సమాచారం.

## బీసీల అభివృద్ధి - సంక్షేమమే ప్రధాన లక్ష్యం

### కింజరాపు అచ్చెంనాయుడు



పెద్దాపురం: రాష్ట్రంలో చేనేత రంగం ద్వితీయ స్థానంలో ఉందని, చేనేత కార్మికులు వారి రంగంలో తప్ప ఇతర రంగాలలో పనిచేయలేక వలసబాట పడుతున్నారని, అట్టి చేనేత రంగాన్ని అభివృద్ధి చేసి, వారు స్వయంగా వారి స్థానంలో ఉపాధి సంపాదించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకోవడం జరిగిందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా మరియు చేనేత జౌళీశాఖామాత్యులు కింజరాపు అచ్చెంనాయుడు అన్నారు. బుధవారం స్థానిక భాస్కర కాలనీలో నూతనంగా నిర్మించిన ముప్పద రామారావు చేనేత సహకార సంఘ నూతన భవనం ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు 75 కోట్లు రుణమాఫీ చేయడం జరిగిందని, 50 సం॥లకు పింఛన్లు మంజూరు చేయబడినవని, ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన చీర, దోవతి పథకం తిరిగి ప్రవేశపెట్టబడినదని, ప్రస్తుతం 25వేల కొత్త పింఛన్లు మంజూరు చేయబడినవని అన్నారు. జనవరి 1 తరువాత వివాహ ఖర్చుల నిమిత్తం 35 వేలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, మగ్గాల నిర్మాణానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వగలమని అన్నారు. చేనేత కార్మికులు తిరిగి వారు ఉన్నత స్థాయికి తీసుకొని రావడమే మా ప్రభుత్వ ధ్యేయమని మంత్రి అన్నారు. మరియు పెద్దాపురం పట్టణం అభివృద్ధికి హోంమంత్రి ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప చేసిన కృషిని సభాముఖంగా అభినందించారు. రాష్ట్రంలో గల 175 నియోజకవర్గాలలో పెద్దాపురానికి ప్రత్యేక స్థాయి రావడానికి చినరాజప్ప చేసిన కృషి ప్రశంసనీయమైనదని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి చినరాజప్ప మాట్లాడుతూ పెద్దాపురం పట్టణాభివృద్ధికి అన్ని విధాల కృషి చేయడం జరుగుతున్నదని, పెద్దాపురం బీసీలు అధిక సంఖ్యాకులు కావున వారి సంక్షేమమే ధ్యేయని అన్నారు. విలేకర్ల సమావేశంలో అచ్చెంనాయుడు మాట్లాడుతూ కాపులను బీసీలో చేర్చడానికి ముఖ్యమంత్రి మంచి నిర్ణయం తీసుకున్నారని, అయితే కొంతమంది కాపులను అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందుతున్నారని, కాపులు అధికంగా వుంటే ఆధార్‌కార్డులో లెక్కలు చెప్పాలని, అయితే కాపు రిజర్వేషన్‌పై విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన స్పదించలేదని అచ్చెంనాయుడు వ్యాఖ్యానించారు.



మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబు మాట్లాడుతూ చేనేత కార్మికులు సంక్షేమం కొరకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఆప్‌కో డైరక్టర్ ముప్పన వీర్రాజు మాట్లాడుతూ ముప్పన రామారావు చేనేత సహకార సంఘ భవనం 58 లక్షలతో నిర్మించామని, అందరికి అందుబాటులో సేవలందించగలమని వీర్రాజు అన్నారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ కురుపూరి రాజు, పారిశ్రామికవేత్త మద్దే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరు మన బాధ్యత సేవలు అభినందనీయం

పెదపూడి: మన ఊరు మన బాధ్యత సేవలు అభినంద నీయమని ఇంద్రపాలెం ఎస్ఐ.డి.రామారావు అన్నారు. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ కి మన ఊరు మన బాధ్యత సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్టేషన్ ఆవరణ లో మొక్కలు నాటి ఇనుప గ్రిల్స్ ను సంస్థ సభ్యులు ఎస్.ఐ కి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ రామారావు మాట్లాడుతూ సామాజిక స్పృహతో ఇంద్ర పాలెం గ్రామంలో పరిసరాల పరిశు భ్రత, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ రహిత సమాజానికి మన ఊరు మన బాధ్యత సంస్థ నిస్వార్థంగా సేవ అందిస్తుందని కితాబి చ్చారు.ఇంద్రపాలెం పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన పార్క్ లో మొక్కలను పెంచడం సందర్శకులకు సౌకర్యార్థం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తు న్నారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా మన ఊరు మన బాధ్యత సంస్థ అధ్యక్షుడైన రామ్మోహన్ మాట్లాడుతూ ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ ని మోడరన్ పోలీస్ స్టేషన్ గా తీర్చి దిద్ది, పర్యావరణానికి పెద్ద పీట వేస్తూ స్టేషన్ ఆవరణలో మొక్కలు పెంచుతున్న ఎస్.ఐ రామారావు ను సంస్థ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమం లో స్టేషన్ రైటర్ సత్య నారాయణ, కానిస్టేబుల్స్ బాలాజీ,రవి.వెంకటేశ్వరరావు,స్టేషన్ సిబ్బంది,మరియు మనఊరు మన బాధ్యత సభ్యులు పాల్గొన్నారు.

## మాలధారణ ధరించిన భక్తులు నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం

### ఎంతో ఆనందదాయకం : సనపల బంగారురాజు

మాధవధార : మాలధారణ ధరించిన భక్తులు నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనంద దాయకమని జివిఎంసి మాధవధార హైస్కూల్ స్వర్ణత్సావ కమిటి ఛైర్మన్ సనపల బంగారురాజు అన్నారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన బుధవారం మాధవధార అయ్యప్ప సేవా సంఘం గురుస్వామి మోజ్జాడ కిషోర్‌కుమార్‌ను అయ్యప్పస్వామి పిఠం అవరణలో ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 4వ తేదిన నిత్యఅన్నదాన ప్రసాదం(భిక్ష) బుధవారం 41వ రోజుల పాటు నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. మాలధారణ ధరించడం వల్ల నిత్యం ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సంఘం సభ్యులు సనపల పాండురంగారావు, పూజారి ఉదయ్‌కుమార్, గొండు అచ్యుతరావు, మెట్ట రవి, సనపల వెంకటరావు, సనపల గోవిందరాజు, సనపల గోవింద్(చిన్న బేగిలు), సనపల సందీప్ తదితరులు పాల్గొన్నారు.



**కిషోర్‌కుమార్‌ను సన్మానిస్తున్న బంగారురాజు, పాండురంగారావు**

**దాతకి అభినందనలు** : మాలధారణ ధరించిన మాధవధార, మురళీనగర్ ప్రాంతంలో ఉన్న భక్తులు అన్ని విధాల తమకు సహకరించిన మాధవధార కొత్తమహలక్ష్మి అమ్మవారు ఆలయ ఛైర్మన్ సనపల బంగారాజుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### ఎ .కొత్తపల్లి హైస్కులు కు 2 లక్షల వస్తువులు పంపిణీ

దేవరాపల్లి : మండలంలోని ఎ .కొత్తపల్లి హైస్కులు కు యునైటెడ్ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీ 2 లక్షల విలువైన వస్తువులను అందజేసింది .పిఎస్సార్ ప్రొగ్రామ్ కింద కంపెనీ రీజనల్ మేనేజర్ వై .బాలయ్య బుధవారం హైస్కులు ప్రధానోపాధ్యాయుడు ఎ.వి గంగాధర్ కు 32 డెస్కు బెంచీలు ,డిజిటల్ ప్రొజెక్టర్ ఒకటి ,పిల్లలకు స్పోర్ట్సు కిట్లను అందించారు .ఈ సందర్భంగా అయన మాట్లడుతూ విద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జి .వర్రపసాదు ,ఎ .రామారావు ,విద్యాధర్, జి.పి.రాజు ఎంపిటీసీ పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల రక్షణకు పోలీసులు పగడ్బందీ చర్యలు

### ఆటోడ్రైవర్లకు అవగాహన చర్య

పెద్దాపురం : ప్రజలు నిరంతరం ప్రమాణాలతో సతమతం అవుతున్న ఈ తరుణంలో ఆటోలపై అధిక శాతం మంది ప్రయాణించడం, ప్రమాదాలు జరగడం పట్ల పెద్దాపురం పోలీసులు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద డియస్‌పి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డియస్‌పి సిహెచ్.రామారావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల పూర్తి సమాచారం కంప్యూటరైజ్డ్ చేయడం జరుగుచున్నదని, వారి డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు వివరాలు, వారి ఆటో నిలుపు చేసిన స్టాండు, వారి ఫోటో, సెల్ నెంబర్, పూర్తి చిరునామాలతో కూడిన స్టిక్కర్లు ఆటో లోపలి భాగంలో అతికించబడునని తెలిపారు. దీని తోడు ఆటోలో నిబంధనల మించి ప్రయాణీలను అనుమతించకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆయన వివరించారు. వాహనాలు పెరగడం, అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలు రోడ్లపై తిరగడంతో ప్రజలు జాగ్రత్తలు వహించాలని కోరారు. ప్రజలకు ప్రమాదాలు నివారించి, రక్షణ కలిగించడానికి పోలీసు శాఖ ఈ చర్యలు చేపట్టిందని డియస్‌పి అన్నారు. ఈ సమావేశంలో సిఐ వీరయ్యగౌడ్, ఎఎస్ఐ శంకరరావు రెండువందల మంది ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

### మిస్ వైజాగ్ పూజితకు బ్రాండిక్స్ దొరస్వామి అభినందనలు



అచ్యుతాపురం: మిస్ వైజాగ్ 2017 పోటీలకు న్యాయ నిర్నేతగా వ్యవహరించినందుకు చాలా ఆనందంగా ఉందని బ్రాండిక్స్ ఇండియా పార్ట్‌నర్ దొరస్వామి అన్నారు. బుదవారం ఆయన ఈ విషయాన్ని విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా మిస్ వైజాగ్ దక్కించుకున్న కమల పూజితకు, ఫస్ట్ రన్నర్‌గా రోజలైన్, సెకండ్ రన్నర్‌గా లక్కీ లను హృదయ పుర్వకంగా అభినందించారు. అలాగే ఈ పోటీలలో పాల్గొన్న వారందరినీ ప్రత్యేకంగా అభినందించారు.

### వీధి దీపాలు పునరుద్ధరించాలి

అరకులోయ: మండలంలోని గన్నెల పంచాయితీ పరిధిలో గల మారుమూల కొన్ని గ్రామాల్లో వీధి దీపాలు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని వార్డు మెంబర్ మల్లన్న బుధవారం కోరారు. రెండేళ్లగా పంచాయితీ కేంద్రంతో పాటు గ్రామాల్లో కూడా వీధి దీపాల పునరుద్ధరణకు చర్యలు లేకపోవడంతో రాత్రుళ్లు అంథకారంగా మగ్గవలసి వస్తుందన్నారు.



**ఈనెల 20వతేదీన మద్దిలపాలెం, కళాభారతి ఆడిటోరియంనందు సాయంత్రం కెరీర్ సెన్సిటైజేషన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తుంది. యువతకు లక్ష్య సాధనపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని బాదంగీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో హర్షదీపక్, వినోద్‌కుమార్, డా.శాలిని, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ సంబంధించి మరిన్ని వివరాలకు 9440458458, 7981949319, 8977370320 నెంబర్లను సంప్రదించగలరు.**

### విద్యార్థినులకు రక్త పరీక్షలు..



చోడవరం: స్థానిక జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, రక్తహీనత తదితర ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించినట్లు హెచ్.ఎం. రాజేశ్వరి తెలియజేసారు. కౌమార దశలో ఉన్న విద్యార్థినుల్లో రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవలసిందిగా వైద్యులు సూచించారు. రోజు తీసుకునే ఆహారంలో సమతుల్యత పాటించాలన్నారు. పాలు, గుడ్లు, ఆకు కూరలు తప్పనిసరిగా తీసుకోవలసిందిగా వారు సూచించారు.

2018 డైరీలు, క్యాలెండర్లు హోల్‌సేల్
భారతీయ స్టేషనరీ & బుక్ సెంటర్
పూర్ణామార్కెట్
కార్ పార్కింగ్ ఎదురుగా
విశాఖపట్నం 530001
98499 92338, 2561749, 2781865

## ఆటోనగర్‌లో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో ప్రారంభం

**-రాష్ట్రంలోని సూక్ష్మ చిన్న మధ్యతరహ పరిశ్రమలను కాపాడుకోవాలి**
**-జిఎస్టీ ప్రిన్సిపల్ కమీషనర్ బి.హరేరాం**



గాజువాక: రాష్ట్రంలోని సూక్ష, చిన్న, మద్యతరహ పరిశ్రమలను కాపాడు కోవలసిన ఆవశ్యకత ఎంతైన ఉందని జిఎస్టీ ప్రిన్సిపల్ కమీషనర్ బి.హరేరాం స్పష్టం చేసారు. బుధవారం ఆటోనగర్‌లో ఐలా కేంద్రం వద్ద భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మద్యతరహ పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో, స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని జ్యోతిప్రజలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పరి శ్రమలను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. వారికి అవసరమగు లోన్స్‌ను బ్యాంక్‌నుంచి పొందే అవకాశాన్ని కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. విశాఖ పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందిన ప్రాంతమని అన్నారు. విశాఖ ఉక్కుకర్మాగారం, హెచ్.ఎస్.ఎల్, హెచ్.పి. సి.యల్ గంగవరం పోర్టులను అనుకొని వేలాదిగా చిన్న పరిశ్రమలు అభివృద్ధి చెందు తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ, చిన్నతరహ, మద్యతరహ పరిశ్రమల నిర్వా హకులు తదితరులు పాల్గొన్నారు.

### ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

D.Vijaya Bhaskar Reddy
S/o.Late Narayana Reddy
అను నేను Akkayyapalem Sub Register Office to Seethammadhara, N.E.Lay out D.No.50-116-9/1, VSP లో వున్న మాయింటికి వెళ్తుండగా నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి.
నా ఒరిజినల్
Document No 812/2008
Sub-Registrar Pendurthi
Date 27-06-2009
Devi Reddy Deepthi
W/o. మారెడ్డి వంశీకృష్ణ
Sy No.186/1P
విస్తీర్ణం - 0.50 శెంట్లు
or 2420 చ॥గ॥
ఈ డాక్యుమెంట్లు దొరికిన యెడల
ఈ క్రింది ఫోన్‌నెంబర్‌కు తెలియజేయగలరు.
**Cell No: 9959155460**

**In the Honourable Court of the Motor Accident Claims Tribunal cum XII Addl Dist Judge At Visakhapatnam.**

**M O P No.1013/2016**

**Between**
**Ch.Meerayya S/o. Babu Rao ...Petitioner**
**And**
**Sri Ch.Appala Raju and two others ...Respondents**

**To,**
**1. Sri Ch.Appala Raju S/o.Nooka Raju, Motor Cycle Rider AP31CD8993, D.No.14-1-39, Daspalla Hills, Opp-HP Gas Godown, M R Peta Post Visakhapatnam-2. 1st Respondent**
**2. Smt.S.Vara Lakshmi W/o.Sri Guru Murthy, Owner of Motor Cycle AP31CD8993 H.No.62, Siva Narayana Nilayam Daspalla Hills, M R Peta Post Visakhapatnam-2 2nd Respondent**

**NOTICE**

It is hereby informed that the above case is pending before the Honourable Court and the matter stand posted to **08-01-2018** for notice and appearance.

Please take notice that the named petitioner filed above case against you and insurer for Compensation.

You are require to Appear personally or through an advocate duly instructed to appear on that day before the Honourable Court At **10-30 AM** failing which the matter will be decided in your absence as per law.

Date 05-12-2017
Visakhapatnam.

**V.ASHOK KUMAR,**
**Advocate**
**Cell: 9493859938**

### డాక్యుమెంటు పోయినది

నా క్లయింటు తల్లం వెంకట లక్ష్మీ మోహన్ ప్రసాద్ S/o. లేటు సత్యనారాయణ D.No.MIG-II/B-50 గొల్లలపాలెం ఉడా కాలనీ, శ్రీహరిపురం, మల్కాపురం పోస్టు, విశాఖపట్నం వారు ఇచ్చిన బోగట్టాపై నా క్లయింటు తే॥07-12-2017దిన తన ఇంటి నుండి శ్రీహరిపురం ఆటోలో ప్రయాణము చేయుచుండగా నా క్లయింటు తాలూకా గుంటూరు జాయింటు సబ్ రిజిష్టారు ఆఫీసు-II లో రిజిష్టరు కాబడిన స్థిరాస్థి డాక్యుమెంటు నెం.1667/1973 Dated 26-06-1973 గా గల ఒరిజినల్ దస్తావేజు పోయినది. కావున సదరు దస్తావేజు ఎవ్వరికైన దొరికిన యెడల నా క్లయింటు అడ్రసుకు తెలియజేయగలరు. సదరు దస్తావేజు విషయమై లోకులెవ్వరూ ఎటువంటి వ్యవహారములు జరపరాదని తెలియజేయడమైనది.

**D.CHANDRA RAO**
**Advocate**
**D.No.64-3-12,**
**Srihari Puram,**
**Malkapuram Post**
**Visakhapatnam-11**
**Ph: 8712248840**
**9393303297**

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ స్కూల్ బస్సు

పెదపూడి:తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక ఊలపల్లి మధ్య ప్రైవేట్ స్కూల్ బస్సుకు ఘోర పెను ప్రమాదం తప్పింది సుమారు 50మంది విద్యార్థులతో వెళుతున్న ప్రైవేట్ స్కూల్ బస్సు స్టీరింగ్ విరిగి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది ఈ ప్రమాదం **విద్యార్థులకు స్వల్ప గాయాలు** నుంచి విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు గాయాలైన విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు

### కోర్టు ధిక్కారం కేసులో

# గోవాడ షుగర్స్ ఎండీకి నాన్ బెయిల్ వారెంట్...!!!

**- హూదూదు తుఫాను అనంతరం జరిగిన కోట్లాది రూపాయిల కుంభకోణంపై దర్యాప్తు..**

చోడవరం: కోర్టు ధిక్కారం కేసులో గోవాడ షుగర్స్ ఎం.డి.కి బుధవారం నాన్ బెయిల్‌బుల్ (ఎన్.బి.డబ్ల్యూ) అరెష్టు వారెంట్ జారీ అయినట్లు బోగట్టా. 2014 హూదూదు తుఫాను అనంతరం ఫ్యాక్టరీలో తడిసిన పంచదార అమ్మకాలు తదితర విషయాల్లో జరిగిన కోట్లాది రూపాయిల అవకతవకలపైన, గ్రీన్ మింట్ ఇండియాకు జరిగిన మోసంపైన ఆ సంస్థ యాజమాన్యం హైకోర్టు, పోలీసులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి వారు పట్టించుకోపోవడంతో, గ్రీన్ మింట్ ఇండియా ఎం.డి. భూతనాదు మురళీ దొర హైకోర్టును ఆశ్రయించడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో క్రైం రిపోర్టు 14, 127/2016తో గోవాడ షుగర్స్ ఎం.డి., పాలకవర్గ ఛైర్మన్, జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ అధికారులు, సర్వేయిర్లతో కలిపి మొత్తం 18 మందిపై సి.ఆర్.పి.సి, సి.సి 769, 770 సెక్షన్లతో మొత్తం 18 మందిపై పోలీసులు కేసు నమోదు చేసారు. దీనిపై 419, 420, 468, 471, 406, 409 రెడు విత్ 34 ఐ.సి.సి, 120బి లతో స్థానిక న్యాయస్థానం విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో పై కేసుల్లో విచారణకు సహకరించవలసిందిగా ప్రస్తుత ఎం.డికు న్యాయస్థానం సమన్లు జారీ చేసింది.

దీనిపై అక్టోబరు 30న జరిగిన కోర్టు వాయిదాకు ఎం.డి. హాజరుకాలేకపోయారు. దీంతో కోర్టు ధిక్కారణ క్రింద ఫష్టు క్లాస్ మేజిస్ట్రేటు వారు ఎం.డి.కు బుధవారం నాన్ బెయిల్‌బుల్ (ఎన్.బి.డబ్ల్యూ) అరెష్టు వారెంట్ జారీ చేసినట్లు ఫిర్యాది దారుడు, గ్రీన్ మింట్ ఇండియా ఎం.డి. భూతనాదు మురళీ దొర స్థానిక విలేఖరులకు తెలియజేసారు. దీనిపై ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచినట్లు సమాచారం.

# ప్రజల రక్షణకు పోలీసులు పగడ్బందీ చర్యలు

### ఆటోడ్రైవర్లకు అవగాహన చర్య

పెద్దాపురం : ప్రజలు నిరంతరం ప్రమాణాలతో సతమతం అవుతున్న ఈ తరుణంలో ఆటోలపై అధిక శాతం మంది ప్రయాణించడం, ప్రమాదాలు జరగడం పట్ల పెద్దాపురం పోలీసులు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద డియస్‌పి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డియస్‌పి సిహెచ్.రామారావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల పూర్తి సమాచారం కంప్యూటరైజ్డ్ చేయడం జరుగుచున్నదని, వారి డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు వివరాలు, వారి ఆటో నిలుపు చేసిన స్టాండు, వారి ఫోటో, సెల్ నెంబర్, పూర్తి చిరునామాలతో కూడిన స్టిక్కర్లు ఆటో లోపలి భాగంలో అతికించబడునని తెలిపారు. దీని తోడు ఆటోలో నిబంధనల మించి ప్రయాణీలను అనుమతించకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆయన వివరించారు. వాహనాలు పెరగడం, అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలు రోడ్లపై తిరగడంతో ప్రజలు జాగ్రత్తలు వహించాలని కోరారు. ప్రజలకు ప్రమాదాలు నివారించి, రక్షణ కలిగించడానికి పోలీసు శాఖ ఈ చర్యలు చేపట్టిందని డియస్‌పి అన్నారు. ఈ సమావేశంలో సిఐ వీరయ్యగౌడ్, ఎఎస్ఐ శంకరరావు రెండువందల మంది ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

## మిస్ వైజాగ్ పూజితకు బ్రాండిక్స్ దొరస్వామి అభినందనలు



అచ్యుతాపురం: మిస్ వైజాగ్ 2017 పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించినందుకు చాలా ఆనందంగా ఉందని బ్రాండిక్స్ ఇండియా పార్ట్‌నర్ దొరస్వామి అన్నారు. బుదవారం ఆయన ఈ విషయాన్ని విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా మిస్ వైజాగ్ దక్కించుకున్న కమల పూజితకు, ఫస్ట్ రన్నర్‌గా రోజలైన్, సెకండ్ రన్నర్‌గా లక్కీ లను హృదయ పూర్వకంగా అభినందించారు. అలాగే ఈ పోటీలలో పాల్గొన్న వారందరినీ ప్రత్యేకంగా అభినందించారు.

## వీధి దీపాలు పునరుద్ధరించాలి

అరకులోయ: మండలంలోని గన్నెల పంచాయితీ పరిధిలో గల మారుమూల కొన్ని గ్రామాల్లో వీధి దీపాలు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని వార్డు మెంబర్ మల్లన్న బుధవారం కోరారు. రెండేళ్లగా పంచాయితీ కేంద్రంతో పాటు గ్రామాల్లో కూడా వీధి దీపాల పునరుద్ధరణకు చర్యలు లేకపోవడంతో రాత్రుళ్లు అంథకారంగా మగ్గవలసి వస్తుందన్నారు.



**ఈనెల 20వతేదీన మద్దిలపాలెం, కళాభారతి ఆడిటోరియంనందు సాయంత్రం కెరీర్ సెన్సిటైజేషన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తుంది. యువతకు లక్ష్య సాధనపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని బాదంగీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో హర్షదీపక్, వినోద్‌కుమార్, డా.శాలిని, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ సంబంధించి మరిన్ని వివరాలకు 9440458458, 7981949319, 8977370320 నెంబర్లను సంప్రదించగలరు.**

# బీసీల అభివృద్ధి - సంక్షేమమే ప్రధాన లక్ష్యం

### కింజరాపు అచ్చెంనాయుడు



పెద్దాపురం: రాష్ట్రంలో చేనేత రంగం ద్వితీయ స్థానంలో ఉందని, చేనేత కార్మాకులు వారి రంగంలో తప్ప ఇతర రంగాలలో పనిచేయలేక వలసబాట పడుతున్నారని, అట్టి చేనేత రంగాన్ని అభివృద్ధి చేసి, వారు స్వయంగా వారి స్థానంలో ఉపాధి సంపాదించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకోవడం జరిగందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా మరియు చేనేత జౌళీశాఖామాత్యులు కింజరాపు అచ్చెంనాయుడు అన్నారు. బుధవారం స్థానిక భాస్కర కాలనీలో నూతనంగా నిర్మించిన ముప్పద రామారావు చేనేత సహకార సంఘ నూతన భవనం ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు 75 కోట్లు రుణమాఫీ చేయడం జరిగిందని, 50 సం॥లకు పింఛన్లు మంజూరు చేయబడినవని, ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన చీర, దోవతి పథకం తిరిగి ప్రవేశపెట్టబడినదని, ప్రస్తుతం 25వేల కొత్త పింఛన్లు మంజూరు చేయబడినవని అన్నారు. జనవరి 1 తరువాత వివాహ ఖర్చుల నిమిత్తం 35 వేలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, మగ్గాల నిర్మాణానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వగలమని అన్నారు. చేనేత కార్మికులు తిరిగి వారు ఉన్నత స్థాయికి తీసుకొని రావడమే మా ప్రభుత్వ ధ్యేయమని మంత్రి అన్నారు. మరియు పెద్దాపురం పట్టణం అభివృద్ధికి హోంమంత్రి ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప చేసిన కృషిని సభాముఖంగా అభినందించారు. రాష్ట్రంలో గల 175 నియోజకవర్గాలలో పెద్దాపురానికి ప్రత్యేక స్థాయి రావడానికి చినరాజప్ప చేసిన కృషి ప్రశంసనీయమైనదని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి చినరాజప్ప మాట్లాడుతూ పెద్దాపురం పట్టణాభివృద్ధికి అన్ని విధాల కృషి చేయడం జరుగుతున్నదని, పెద్దాపురం బీసీలు అధిక సంఖ్యాకులు కావున వారి సంక్షేమమే ధ్యేయని అన్నారు. విలేకర్ల సమావేశంలో అచ్చెంనాయుడు మాట్లాడుతూ కాపులను బీసీలో చేర్చడానికి ముఖ్యమంత్రి మంచి నిర్ణయం తీసుకున్నారని, అయితే కొంతమంది కాపులను అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందుతున్నారని, కాపులు అధికంగా వుంటే ఆధార్‌కార్డులో లెక్కలు చెప్పాలని, అయితే కాపు రిజర్వేషన్‌పై విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన స్పదించలేదని అచ్చెంనాయుడు వ్యాఖ్యానించారు.



మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబు మాట్లాడుతూ చేనేత కార్మికులు సంక్షేమం కొరకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఆప్‌కో డైరక్టర్ ముప్పన వీర్రాజు మాట్లాడుతూ ముప్పన రామారావు చేనేత సహకార సంఘ భవనం 58 లక్షలతో నిర్మించామని, అందరికి అందుబాటులో సేవలందించగలమని వీర్రాజు అన్నారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ కురుపూరి రాజు, పారిశ్రామికవేత్త మద్దే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు రక్త పరీక్షలు..



చోడవరం: స్థానిక జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, రక్తహీనత తదితర ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించినట్లు హెచ్.ఎం. రాజేశ్వరి తెలియజేసారు. కౌమార దశలో ఉన్న విద్యార్థినుల్లో రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవలసిందిగా వైద్యులు సూచించారు. రోజూ తీసుకునే ఆహారంలో సమతుల్యత పాటించాలన్నారు. పాలు, గుడ్లు, ఆకు కూరలు తప్పనిసరిగా తీసుకోవలసిందిగా వారు సూచించారు.

# మన ఊరు మన బాధ్యత సేవలు అభినందనీయం

పెదపూడి: మన ఊరు మన బాధ్యత సేవలు అభినంద నీయమని ఇంద్రపాలెం ఎస్ఐ.డి.రామారావు అన్నారు. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ కి మన ఊరు మన బాధ్యత సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్టేషన్ ఆవరణ లో మొక్కలు నాటి ఇనుప గ్రిల్స్ ను సంస్థ సభ్యులు ఎస్.ఐ కి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ రామారావు మాట్లాడుతూ సామాజిక స్పృహతో ఇంద్ర పాలెం గ్రామంలో పరిసరాల పరిశు భ్రత, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ రహిత సమాజానికి మన ఊరు మన బాధ్యత సంస్థ నిస్వార్థంగా సేవ అందిస్తుందని కితాబి చ్చారు.ఇంద్రపాలెం పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన పార్క్ లో మొక్కలను పెంచడం సందర్శకులకు సౌకర్యార్థం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తు న్నారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా మన ఊరు మన బాధ్యత సంస్థ అధ్యక్షుడైన రామ్మోహన్ మాట్లాడుతూ ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ ని మోడరన్ పోలీస్ స్టేషన్ గా తీర్చి దిద్ది, పర్యావరణానికి పెద్ద పీట వేస్తూ స్టేషన్ ఆవరణలో మొక్కలు పెంచుతున్న ఎస్.ఐ రామారావు ను సంస్థ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమం లో స్టేషన్ రైటర్ సత్య నారాయణ, కానిస్టేబుల్స్ బాలాజీ,రవి.వెంకటేశ్వరరావు,స్టేషన్ సిబ్బంది,మరియు మనఊరు మన బాధ్యత సభ్యులు పాల్గొన్నారు.

# అటోనగర్‌లో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో ప్రారంభం

**-రాష్ట్రంలోని సూక్ష్మ చిన్న మద్యతరహ పరిశ్రమలను కాపాడుకోవాలి**

**-జీఎస్టీ ప్రిన్సిపల్ కమీషనర్ బి.హరేరాం**




గాజువాక: రాష్ట్రంలోని సూక్ష, చిన్న, మద్యతరహ పరిశ్రమలను కాపాడు కోవలసిన ఆవశ్యకత ఎంతైన ఉందని జీఎస్టీ ప్రిన్సిపల్ కమీషనర్ బి.హరేరాం స్పష్టం చేసారు. బుధవారం అటోనగర్‌లో ఐలా కేంద్రం వద్ద భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మద్యతరహ పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో, స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని జ్యోతిప్రజలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పరి శ్రమలను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. వారికి అవసరమగు లోన్సను బ్యాంక్‌నుంచి పొందే అవకాశాన్ని కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. విశాఖ పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందిన ప్రాంతమని అన్నారు. విశాఖ ఉక్కుకర్మాగారం, హెచ్.ఎస్.ఎల్, హెచ్.పి. సి.యల్ గంగవరం పోర్టులను అనుకొని వేలాదిగా చిన్న పరిశ్రమలు అభివృద్ధి చెందు తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ, చిన్నతరహ, మద్యతరహ పరిశ్రమల నిర్వా హకులు తదితరులు పాల్గొన్నారు.

2018 డైరీలు, క్యాలెండర్లు హోల్‌సేల్
భారతీయ స్టేషనరీ & బుక్ సెంటర్
పూర్ణామార్కెట్ కార్ పార్కింగ్ ఎదురుగా
విశాఖపట్నం 530001
98499 92338, 2561749, 2781865

**ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి**

D.Vijaya Bhaskar Reddy
S/o.Late Narayana Reddy
అను నేను Akkayyapalem Sub Register Office to Seethammadhara, N.E.Lay out
D.No.50-116-9/1, VSP లో వున్న మాయింటికి వెళ్తుండగా నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి. నా ఒరిజినల్
Document No 812/2008
Sub-Registrar Pendurthi
Date 27-06-2009
Devi Reddy Deepthi
W/o. మారెడ్డి వంశీకృష్ణ
Sy No.186/1P
విస్తీర్ణం - 0.50 సెంట్లు
or 2420 చ॥గ॥
ఈ డాక్యుమెంట్లు దొరికిన యెడల ఈ క్రింది ఫోన్‌నెంబర్‌కు తెలియజేయగలరు.
Cell No: 9959155460

# మాలధారణ ధరించిన భక్తులు నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం

### ఎంతో అనందదాయకం : సనపల బంగారురాజు



కిషోర్‌కుమార్‌ను సన్మానిస్తున్న బంగారురాజు, పాండురంగారావు

మాధవధార : మాలధారణ ధరించిన భక్తులు నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో అనంద దాయకమని జివిఎంసి మాధవధార హైస్కూల్ స్వర్ణత్సావ కమిటి ఛైర్మన్ సనపల బంగారురాజు అన్నారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన బుధవారం మాధవధార అయ్యప్ప సేవా సంఘం గురుస్వామి మోజ్జాడ కిషోర్‌కుమార్‌ను అయ్యప్పస్వామి పిఠం అవరణలో ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 4వ తేదిన నిత్యఅన్నదాన ప్రసాదం(భిక్ష) బుధవారం 41వ రోజుల పాటు నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. మాలధారణ ధరించడం వల్ల నిత్యం ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సంఘం సభ్యులు సనపల పాండురంగారావు, పూజారి ఉదయ్‌కుమార్, గొండు అచ్యుతరావు, మెట్ట రవి, సనపల వెంకటరావు, సనపల గోవిందరాజు, సనపల గోవింద్(చిన్న బేగిలు), సనపల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

**దాతకి అభినందనలు** : మాలధారణ ధరించిన మాధవధార, మురళీనగర్ ప్రాంతంలో ఉన్న భక్తులు అన్ని విధాల తమకు సహకరించిన మాధవధార కొత్తమహలక్ష్మి అమ్మవారు ఆలయ ఛైర్మన్ సనపల బంగారాజుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఎ .కొత్తపల్లి హైస్కులు కు 2 లక్షల వస్తువులు పంపిణీ

దేవరాపల్లి : మండలంలోని ఎ .కొత్తపల్లి హైస్కులు కు యునైటెడ్ ఇండియా ఇన్సురెన్స్ కంపినీ 2 లక్షల విలువైన వస్తువులను అందజేసింది .పిఎస్సార్ ప్రొగ్రామ్ కింద కంపినీ రీజనల్ మేనేజర్ వై .బాలయ్య బుధవారం హైస్కులు ప్రధానోపాధ్యాయుడు ఎ.వి గంగాధర్ కు 32 డెస్కు బెంచీలు ,డిజిటల్ ప్రొజెక్టర్ ఒకటి ,పిల్లలకు స్పోర్ట్స్ కిట్లను అందించారు .ఈ సందర్భంగా అయన మాట్లడుతూ విద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జి .వర్రపసాదు ,ఎ .రామారావు ,విద్యాధర్, జి.పి.రాజు ఎంపిటీసీ పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**In the Honourable Court of the Motor Accident Claims Tribunal cum XII Addl Dist Judge At Visakhapatnam.**
**M O P No.1013/2016**
**Between**
**Ch.Meerayya S/o. Babu Rao ...Petitioner**
**And**
**Sri Ch.Appala Raju and two others ...Respondents**
**To,**
**1. Sri Ch.Appala Raju S/o.Nooka Raju, Motor Cycle Rider AP31CD8993, D.No.14-1-39, Daspalla Hills, Opp-HP Gas Godown, M R Peta Post Visakhapatnam-2. 1st Respondent**
**2. Smt.S.Vara Lakshmi W/o.Sri Guru Murthy, Owner of Motor Cycle AP31CD8993 H.No.62, Siva Narayana Nilayam Daspalla Hills, M R Peta Post Visakhapatnam-2 2nd Respondent**

**NOTICE**

It is hereby informed that the above case is pending before the Honourable Court and the matter stand posted to **08-01-2018** for notice and appearance.

Please take notice that the named petitioner filed above case against you and insurer for Compensation.

You are require to Appear personally or through an advocate duly instructed to appear on that day before the Honourable Court At **10-30 AM** failing which the matter will be decided in your absence as per law.

Date 05-12-2017
Visakhapatnam.
**V.ASHOK KUMAR,**
**Advocate**
**Cell: 9493859938**

**డాక్యుమెంటు పోయినది**

నా క్లయింటు తల్లం వెంకట లక్ష్మీ మోహన్ ప్రసాద్ S/o. లేటు సత్యనారాయణ D.No.MIG-II/B-50 గొల్లలపాలెం ఉడా కాలనీ, శ్రీహరిపురం, మల్కాపురం పోస్టు, విశాఖపట్నం వారు ఇచ్చిన బోగట్టాపై నా క్లయింటు తే॥07-12-2017దిన తన ఇంటి నుండి శ్రీహరిపురం ఆటోలో ప్రయాణము చేయుచుండగా నా క్లయింటు తాలూకా గుంటూరు జాయింటు సబ్ రిజిష్టారు ఆఫీసు-II లో రిజిష్టరు కాబడిన స్థిరాస్థి డాక్యుమెంటు నెం.1667/1973 Dated 26-06-1973 గా గల ఒరిజినల్ దస్తావేజు పోయినది. కావున సదరు దస్తావేజు ఎవ్వరికైన దొరికిన యెడల నా క్లయింటు అడ్రసుకు తెలియజేయగలరు. సదరు దస్తావేజు విషయమై లోకులెవ్వరూ ఎటువంటి వ్యవహారములు జరపరాదని తెలియజేయడమైనది.

**D.CHANDRA RAO**
**Advocate**
**D.No.64-3-12,**
**Srihari Puram,**
**Malkapuram Post**
**Visakhapatnam-11**
**Ph: 8712248840**
**9393303297**

# అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవు

## - ఎమ్మెల్యే వాసుపల్లి



విశాఖపట్నం : భారీ మురుగుకాల్వలమీద పలకలు, మ్యాన్‌హొల్ మీద మూతలు తప్పనిసరిగా ఉండాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం 26వ వార్డులో పర్యటించారు.

ఈ సందర్భంగా ఇందిరాప్రియదర్శిని స్టేడియం, వెలంపేట, పాలికలవారివీధి, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాల పర్యటించి కాల్వలపై పలకలు ఏర్పాటు పనులను పరిశీలించారు. పనులువేగం పెంచాలిన, పలకలమద్య ఖాళీలు ఉంచవద్దన్నారు. ఇది లోతట్టు ప్రాంతమని నగరంలోని వరదనీరు, మురుగు నీరు ఇటుగా వస్తుందని ప్రజలు చిన్నారుల యందు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

పూడిక తీసిన వెంటనే పలకలను మూసివేయాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఎమ్మెల్యే వరుపు అనుచరులు వేధిస్తున్నారంటూ ధర్నా



కాకినాడ/ ఏలేశ్వరం : ప్రత్తిపాడు నియోజక వర్గం ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అనుచరులు తమను వేధిస్తున్నారంటూ ఏలేశ్వరం మండలం లింగంపర్తి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు.మంగళవారం లింగంపర్తి సెంటర్లో వైఎస్సార్ విగ్రహం వద్ద చిక్కాల లక్షణరావు , కార్యక్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్షణరావు మాట్లాడుతూ తామంతా వైఎస్సార్ పార్టీలో చేరినందుకు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ఎమ్మెల్యే వరుపుల అనుచరులు వేధింపులకు గురి చేయడం భావ్యంకాదన్నారు. ఎమ్మెల్యే ఒక పార్టీలో గెలిచి మరొక పార్టీలోనికి మారిపోయారని అటువంటిది మేము మారితే తప్పేంటని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నాయకత్వం పై నమ్మకంతో ఆపార్టీలో చేరామన్నారు. కార్యకర్తలు ఎప్పుడూ నీతికి నిలబడి పనిచేస్తారని నాయకులే సొంత ప్రయోజనాలకు నీతిమాలిన రాజకీయాలు చేస్తారన్నారు. పార్టీఫిరాయింపులు చేసి సొమ్ములకు అమ్ముడుపోయే దిగజారుడు రాజకీయాలు మేము చేయలేదని గ్రహించి వేధింపులు మానాలని హితవు పలికారు.

# కానిస్టేబుల్‌కు పుదుచ్చేరి గవర్నర్ సత్కారం



యానాం : గౌతమీ గోదావరిలో కొట్టుకుపోతున్న డింపు కార్మికుడ్ని శనివారం రాత్రి నదిలోకి దూకి కాపాడిన యానాం పోలీస్ కానిస్టేబల్ పెమ్మాడి కేశవరావును పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేధి సత్కరించారు. విధినిర్వాహణలో ఉండగా వచ్చిన ఫోన్‌కాల్‌కు స్పందించి ప్రాణాలకు తెగించి రాత్రి సమయంలో గోదావరిలోకి దూకి నిండుప్రాణాలను కాపాడటం అభినందనీయమన్నారు. పుదుచ్చేరి వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందిచే పోలీసులు గూర్చి తెలియజేయాలంటూ లెఫ్టినెంట్ గవర్నర్ జారీచేసిన ఉత్తర్వులు నేపద్యంలో కేశవరావును ఎంపికచేశారు. గోరుమేడులోని పోలీస్ ట్రైనింగ్ సర్కిల్‌కు వచ్చిన లెఫ్టినెంట్ గవర్నర్, డిజిపి సునిల్ కుమార్ గౌతమ్ పి. కేశవరావును దుశ్శాలవతో సత్కరించి, ప్రశంసాపత్రాన్ని అందచేశారు.

# మానవత్వానికి మించిన మతం లేదు

## యూత్ వేల్ఫేర్ అసోసియేషన్ అని మహమ్మద్ ఫారూఖ్ షుబ్లి



రావులపాలెం : మానవత్వానికి మించిన మతం లేదని, భారతీయులందరూ ఒకటే అని చాటి చెప్పేందుకే యూత్ వేల్ఫేర్ అసోసియేషన్ అని మహమ్మద్ ఫారూఖ్ షుబ్లి అన్నారు. షేక్ అజహర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మహమ్మద్ ఫారూఖ్ షుబ్లి పాల్గొన్నారు. స్థానిక బండి రేవు పుంత శ్రీనివాస్ నగర్‌లో మదర్‌సా ఉర్దూ అరబిక్ పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు వితరణ చేసారు. షుబ్లి మాట్లాడుతూ మానవ జీవితంలో స్వేచ్ఛకు సమానత్వమునకు గౌరవమునకు హక్కులను కాపాడే బాధ్యత ప్రతి భారతీయ పౌరునికి ఉందని ఈ సందర్భముగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహేంద్రరెడ్డి, సుధాకరరెడ్డి, కంకటాల పవన్ మణికంఠ, వీరభద్రరావు, సీతామారామరెడ్డి, జనిపిరెడ్డి తాతారావు, మహమ్మద్ ఖాన్, గౌస్, అహ్మద్ భాషా, కరీమొహిద్దిన్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్ష నమూన దృశ్య ప్రదర్శన

యానాం : శ్రీసాయి విద్యానికేతన్ మరియు మల్లం రెసిడెన్షియల్ కాన్‌సెప్ట్ స్కూల్‌లో అంతరిక్ష నమూన దృశ్య ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది ఎక్కడో అంతరిక్షలో జరిగే అద్భుతాలను మన కళ్ళకు కట్టేవిధంగా పాఠ్యాంశంలోని పాఠాలను పరిగణనలోకి తీసుకొని విద్యార్థులు రూపొందించారు. దీనిలో అంతరిక్షం, గ్రహాలు, గ్రహ శకలాలు, సూరీడు, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహమండల నమూనాలు విద్యార్థులు స్వయంగా అంతరిక్షంలోనికి వెళ్ళిన అనుభూతులు పొందేలా శ్రీసాయి విద్యానికేతన్‌లో స్కైలేబ్‌ను ఏర్పటుచేయడం జరిగింది. ఈ దృశ్యాలను చూసిన విద్యార్థులు కొత్త అనుభూతిని కలిగించాయని ఆనందం వ్యక్తంచేశారు. విద్యాసంస్థల చైర్మన్ మల్లం నాగబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేయడంపట్ల హర్షం వ్యక్తంచేశారు.

# బిసి వసతిగృహ మార్పు సహించం

తాళ్లరేవు : మండల కేంద్రంలోని బిసి హాస్టల్‌ను ఆరోగ్యశ్రీ కేంద్రానికి మార్చేందుకు ప్రయత్నంచేస్తే సహించేదిలేదని బిసిలను రెచ్చగొట్టే దోరణిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఉన్నారని అఖిల పక్ష కమిటీ నాయకులు ఆరోపించారు. తాళ్లరేవులో అఖిలపక్ష నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, కాశి లక్ష్మణసామి, మాజీ సర్పంచ్ బి. లక్ష్మీ నరసింహరాజు, పి. సత్తిబాబులు మాట్లాడారు. బిసిలకు కేటాయించిన భవనాన్ని ఆరోగ్యశ్రీ వైద్య సేవలకు ఇచ్చినట్లుగా వైద్యశాఖ ఉన్నతస్థాయి అధికారులను నమ్మించే ప్రయత్నం మానుకోవాలన్నారు. బిసి సాంఘిక సంక్షేమశాఖ నిధులతో నిర్మించిన హాస్టల్‌ను స్వాధీనం చేసుకోవాలన్న ఆలోచన విరమించుకోవాలన్నారు.

# 16న సత్యదేవుని సన్నిధిలో మెట్లోత్సవం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ప్రతీ సంవత్సరం ధనుర్మాస ప్రారంభ సూచికగా నిర్వహించే మెట్లోత్సం ఈ నెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇప్పటికే మెట్లకు రంగులు వేసి ఆకర్షణీయమైనవిగా తీర్చిదిద్దుతున్నారు. ఆరోజు ఉదయం 8 గంటలకు స్వామివారి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి 8-30 ని.ల నుండి మెట్టు, మెట్టుకు పసుపు, కుంకుమ వ్రాసి హరతులు ఇస్తారు. ఈ మెట్లోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఆలయ ఈవో ఎమ్.జితేంద్ర తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

# మహిళా రైతులు వ్యవసాయంపై అవగాహన కల్గి ఉండాలి

రావులపాలెం : మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం మహిళా సాధికారిక కార్యక్రమం నిర్వహించారు. పెద్దాపురం రైతు శిక్షణ కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు పి.వి.వి.ఎన్.ఎస్.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా రైతులకు వ్యవసాయంపై ఖర్చు తగ్గించడం, దిగుబడి పెంచడం, భూసార, విత్తన శుద్ధి, విత్తనాల సేకరణలో తీసుకోవలసిన మెలకువలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేసారు. పంటలకు ముఖ్య పోషకాలైన నాడెప్ కంపోస్టు, వర్మి కంపోస్టు, అజోల్లా తయారీ విధానం గురించి వివరించారు. మహిళా రైతులు పెరటి తోటలు, కూరగాయల పెంపకంతో కుటుంబానకి అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. రసాయనిక పురుగు మందులు వాడకం వల్ల జరిగే అనర్ధాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ బి. మీన, ఎమ్ఏఓ ఎస్.నానిబాబు, ఎమ్‌పిఈఓలు డి. గోవిందు, మణికంఠ, నందిని, మహిళా రైతులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి క్యారమ్స్ పోటీలకు ఎంపిక

యానాం : తమిళనాడులోని మధురైలో ఈ నెల 18 నుండి నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను ఎంపికచేశారు. యానాం రిజియన్సీ జూనియర్ కళాశాల విద్యార్థులు పొన్నాడ సతీష్, ఎన్, వీరవేణి, ఎంపిక అయినట్లు యానాం క్యారమ్స్ క్లబ్ అధ్యక్షుడు రచ్చ వేణుగోపాలరాజు ప్రధాన కార్యదర్శి ఊడ మరియ ఫ్రాన్సస్ తెలిపారు. పుదుచ్చేరికి చెందిన కోచ్ అయ్యప్పన్ వద్ద శిక్షణ పొందుతున్న ఈ విద్యార్థులు మెరుగైన ప్రతిభతో జాతీయ పోటీలకు అర్హత పొందారన్నారు. ముంబాయిలో జనవరి 3 నుండి 5 వరకు నిర్వహించే 44వ క్యారమ్స్ జూనియర్, సీనియర్స్ నేషనల్ పోటీలకు కె. సుభశ్రీ, ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కు చెందిన ఎన్. వీరవేణి ఎంపిక అయ్యారన్నారు. ఈ అర్హత పోటీలకు యానాం నుండి 20 మంది క్రీడాకారులు పుదుచ్చేరి వెళ్ళగా వీరిద్దరికీ మాత్రమే అవకాశం దక్కిందన్నారు.

# ప్రజాసంకల్పయాత్రలో తూర్పు నేతలు

కాకినాడ : ప్రతిపక్షనేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ప్రజా సమస్యలను తెలుసుకొనేందుకు ప్రారంభించిన ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా అనంతపురం చేరుకుంది. ఈ సందర్భంగా బుధవారం తూర్పు గోదావరి జిల్లా కాకినాడ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, కాకినాడ సమన్వయకర్త ముత్తా శశిధర్, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త పర్వత శ్రీపూర్ణ చంద్రప్రసాద్, పిఠాపురం సమన్వయకర్త పెండెం దొరబాబు, కొప్పన మోహనరావు, కాకినాడ నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు , కార్పొరేటర్ కంపర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలు, బ్యాటరీ వీల్‌చైర్లు అందచేతలో జాప్యంతగదు

## వికలాంగులు హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు




విశాఖపట్నం : వికలాంగులకు త్రీ వీలర్ మోటారు బైకులు, బ్యాటరీ వీల్‌ఛైర్లు, ఇతర ఉపకరణాలు అందచేతలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం తగదని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌సిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు అన్నారు. జగదాంబ జంక్షన్ లోని సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం డిసెంబర్ 3 తేదీ నాటికి వీటిని అందచేయనున్నట్లు తెలిపిందని అయితే నేటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి గాని కార్పొరేషన్ నుంచిగానీ ఎటవంటి ప్రకటన వెలువడ లేదన్నారు. నిబంధనలను తొలగించి అర్హులందరికీ మరో విడత ఉచితంగా త్రీ వీలర్ మోటారు బైకులు, బ్యాటర్ వీల్‌చైర్లు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

**డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ప్రాధాన్యత కల్పించాలి**

త్వరలో విడుదలచేయనున్న డిఎస్‌సి నోటిఫికేషన్‌లో నూతన వికలాంగుల చట్టం 2016 ప్రకారం వికలాంగులకు రిజర్వేషన్లు అమలుచేయాలన్నారు.

వికలాంగులకు అన్యాయం చేస్తే ఊరుకునేదిలేదన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా, నగర కార్యదర్శులు బుగిడి నూకప్పారావు, పాలవెంకయ్య, జిల్లా నాయకులు జాగారపు సత్యం, అప్పికొండ నూకమ్మ పాల్గొన్నారు.

# మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

పిఠాపురం : పిఠాపురం పురపాలక సంఘ కౌన్సిల్ హాల్ నందు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశము ఈ నెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 11గం॥లకు చైర్మన్ కరణం చిన్నారావు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కమీషనర్ ఎం.రామ్మోహనరావు తెలిపారు. ఈ సమావేశంలో గత నెల 30వ తేదీన జరిగిన సమావేశం వాయిదా పడటంతో అప్పటి అజెండాలోని అంశాలను ఈ అత్యవసర సమావేశము నందు చర్చించడం జరుగుతుందని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 17వ తేదీ ఆదివారం ఉదయం 8 గం॥ నుండి 9.30 వరకు పిఠాపురం పట్టణంలో 19వ వార్డులో రామా మున్సిపల్ ప్రాథమిక పాఠశాల (కత్తుల గూడెం) నందు 'ఆనంద ఆదివారం' కార్యక్రమం నిర్వహించబడుతుందని ఈ కార్యక్రమానికి పురపాలక సంఘ బాలికల ఉన్నత పాఠశాల, మున్సిపల్ ముస్లిం ఉర్దూ పాఠశాల, ఎస్.ఎస్.ఆర్.ఎ. మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, తబిత ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, ఆదిత్య ఉన్నత పాఠశాల, విద్యార్థినీ విద్యార్థులచే సాంస్కృతిక మరియు ఆటల కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్, వార్డు మరియు కో-ఆప్షన్ మెంబర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# వాహన చోదకులకు అందుబాటులో ఆర్టీఓ ఆన్‌లైన్ సేవలు

## డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ ఎస్. వెంకటేశ్వరరావు




రావులపాలెం : ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ ఎస్. వెంకటేశ్వరరావు అన్నారు. రవాణా శాఖకు సంబందించిన 40 రకాల ఆన్‌లైన్ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచామని, రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా విశాఖలో ప్రారంబించామని, అందులో భాగంగా బుధవారం జిల్లాలోనే ప్రప్రదమంగా ఈతకోట నక్షత్ర కమ్యూనికేషన్స్, రావులపాడు రాజ్ పెట్రోస్, భారత్ పెట్రోలియం పెట్రోలు బంకు నందు ఆర్టీఓ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భముగా వాహన వినియోగదారులు, యజమానులు, డ్రైవర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రవాణా శాఖ సేవలు పొందాలంటే తమ కార్యాలయానికి రావల్సి వచ్చేదని ఆన్‌లైన్ సేవలు అందుబాటుతో ప్రజలు నేరుగా 24/7 సెంటర్ల ద్వారా పొందవచ్చని తెలియజేసారు.

ఈ సర్వీసులకు యూనియన్లు, ప్రైవేటు ఇంటర్నెట్ సెంటర్లు దరఖాస్తు చేసుకుంటే సత్వరం అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఇద్దరు దరఖాస్తు దారులకు లైసెన్సును రెన్యువల్ చేసి 5 నిమిషాల్లో సర్టిఫికెట్లు అందజేసారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇనస్పెక్టరు ఎన్. శ్రీదేవి, డి.బి.ఎ. భాస్కరరెడ్డి, రాజ్ పెట్రో నిర్వాహకులు కె.వి.ఎస్.ఎస్. ఆంజనేయరాజు, మేడపాటి రామశేఖర్ రెడ్డి, రంగారెడ్డి, శ్రీనురాజు, మోటారు వాహనాల సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలి

## - ఏ.ఓ. రమేష్‌కుమార్

ఆలమూరు :- దాళ్వాకు ఎం.టి.యు.1010, ఎం.టి.యు.1121 వంటి స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.వి.ఎన్.రమేష్ కుమార్ తెలిపారు. మండల పరిధి చొప్పెల్ల గ్రామంలో బుధవారం ఆత్మ సౌజన్యంతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నీటి సంఘం అధ్యక్షులు మెర్ల గోపాలస్వామి అధ్యక్షతన రబీసాగుకు సమాయాత్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ. మాట్లాడుతూ బొండాలు వేసుకునే రైతులు తొందరగా వేసుకోవాలని లేకపోతే పూత దశకు వచ్చేసరికి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వలన దోమ ఉధృతి ఎక్కువగా వుంటుందని, అలాగే తాలు గింజలు ఎక్కువగా వచ్చే అవకాశం వుంటుందని తెలిపారు. మొదటి దమ్ము చేసిన తరువాత నీరుపెట్టి, విడగొట్టి ఆరబెట్టడం ద్వారా గత పంట తాలూకు స్వర్ణ విత్తనాలు మొలిచిన తరువాత ఎకరాకు 3 బస్తాలు సూపర్‌వేసి దమ్ము చేసుకోవడం వలన పాత విత్తనం అంతా భూమిలో కలసిపోతుందని, తరువాత బొండాలు విత్తనాలు చల్లుకోవాలని రైతులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మఛైర్మన్ నూనె వీర్రాజు చౌదరి, ఆత్మ బి.టి.ఎమ్. డాక్టర్‌బాబు, ఆత్మ డి.ఎఫ్.ఎ.సి. మెంబరు పిల్లి వీరవెంకట్రాజు, ఏఈఓ భువనేశ్వరి, ఎంపిఈఓ మనోహర్, ఎ.టి.ఎమ్. అరుణ్‌సాయి, రైతులు అనుసూరి బ్రహ్మయ్య, ధర్మాసుల వెంకన్న, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# చిత్రభాను

## 12 డేస్ దానికి కమిటైతే



'ఫిదా' సినిమాతో పాపులర్ అయిన నటి గాయిత్రి గుప్తా. ఈ చిత్రంలో హీరోయిన్ సాయి పల్లవి ఫ్రెండ్ పాత్ర పోషించిన నటి గాయిత్రి ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌లో ఇంటర్వ్యూలో టాలీవుడ్ గురించి, ఇండస్ట్రీలో తనకు ఎదురైన కాస్టింగ్ కౌచ్ విషయాల గురించి ధైర్యంగా బయట పెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ టీవీ ఛానల్ 'కాస్టింగ్ కౌచ్' అంశం గురించి నిర్వహించిన చర్చా కార్యక్రమంలో గాయిత్రి గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె తనకు ఎదురైన అనుభాలను వివరించారు. ఇలాంటి సమస్యలు రావడానికి ఇండస్ట్రీ అనే కాదు, ఎక్కడైనా ఆస్కారం ఉంది. అమ్మాయిలు ఎవరికీ లొంగకుండా ధైర్యంగా ముందుకు సాగితే కాస్టింగ్ కౌచ్ లాంటివి అరికట్టవచ్చు. ఆడదాన్ని, మగవాన్ని ఈక్వెల్ గా చూస్తున్న ప్రపంచం ఇది. మన లైఫ్ మన కంట్రోల్ లో ఉండాలి. అందుకే ఇలాంటివి ఎదురైనపుడు వాటి గురించి మాట్లాడటమే కరెక్ట్ అని నా ఫీలింగ్ అని గాయిత్రి గుప్తా తెలిపారు. సినిమా నిర్మాత, డైరెక్టర్, ఆర్టిస్టులు కాకుండా మేనేజర్స్ లెవల్లోనే ఇలాంటి ప్రాబ్లమ్స్ మొదలవుతాయి. వాళ్లు మనల్ని ఒక సినిమా కోసం సంప్రదించినపుడు కమిట్మెంటుకు (పడుకోవడానికి) ప్రిపేర్ అయి ఉన్నావా? లేదా? అని ముందే ఎలాంటి మొహమాటం లేకుండా అడిగేస్తారు.... అని గాయిత్రి గుప్తా తెలిపారు. మూవీ అనేది ఒక కళ. సినిమాల్లో అవకాశం ఇవ్వాలంటే నీకు యాక్టింగ్ టాలెంట్ ఉందా? సింగింగ్ టాలెంట్ ఉందా? డాన్సింగ్ టాలెంట్ ఉందా? అని చూడాలి. కానీ అది(పడుకోవడం) దానికి అర్హత ఎలా అవుతుంది? దానికోసం ఒక సెక్టర్ ఉంది కదా? అంటూ..... గాయిత్రి గుప్తా ప్రశ్నించారు. అందరూ అలా ఉన్నారని అనడం లేదు. నేను ఇప్పటి వరకు 11 సినిమాలు చేశాను. అందులో హిట్టయిన మూవీ ఫిదా'. ఇండస్ట్రీలో అలాంటి వారు కొంత మంది అయితే ఉన్నారు. ఆ కొంత మంది కూడా ఆడ పిల్ల తన పరువు కోసం బయటకు మాట్లాడదు కదా అనే ఉద్దేశ్యంతో ఇలాంటివి చేస్తుంటారు. ఇది ఎక్కడైనా జరుగుతుంది. అయితే సినిమా ఇండస్ట్రీలో ఎక్కువగా ఉంటుంది అని గాయిత్రి గుప్తా తెలిపారు. సినిమా ఇండస్ట్రీ అనేది అన్ ఆర్గనైజ్డ్ సెక్టర్. ఇక్కడ అలాంటి సంఘటనలు ఎదురైతే ఎవరికి కంప్లయింట్ చేయాలో కూడా చాలా మందికి తెలియదు. ఇండస్ట్రీ గురించి తెలియక చాలా మంది దీనిలో ఇరుక్కుంటారు. ఒకసారి తప్పుచేయడం మొదలైతే లైఫ్ స్పాయిల్ అవుతుంది. చాలా మందిని చూశాను. వారు ఇష్టంతో చేయరు. తెలియక చేసి అందులో పడిపోతుంటారు... అని గాయిత్రి గుప్తా తెలిపారు.

రెండు సంవత్సరాల క్రితం నాకు ఓ బాలీవుడ్ మూవీ ఆఫర్ కూడా వచ్చింది. మంచి క్యారెక్టర్. 12 రోజులు కమిట్మెంట్ ఇస్తే ఒక ప్లాట్ గిఫ్ట్ ఇస్తాను, ఒక కారు కొనిస్తాను, 10 లక్షల పేమెంట్ ఇస్తామని చెప్పారు. దీంతో నాకు ఈ ఆఫర్ వద్దని చెప్పి వచ్చేశాను... అని గాయిత్రి గుప్తా తెలిపారు. 12 డేస్ కమిట్మెంట్ అంటే ఏమిటి? 12 రోజులు నటించడమా? అని యాంకర్ ప్రశ్నించగా.... కమిట్మెంట్ అంటే 12 రోజులు వారితో పడుకోవాలి అని గాయిత్రి గుప్తా తెలిపారు. అప్పటి నుండి మేనేజర్స్‌ను కలవడం మానేశాను అని గాయిత్రి గుప్తా తెలిపారు.

## స్వేచ్ఛ కోల్పోలేదు



పెళ్లి తర్వాత పరిస్థితిపై సమంత ! సినిమాల్లో సక్సెస్ అయిన హీరోయిన్ సమంత.... ఇటు ప్రేమలో కూడా విజయం సాధించింది. తను ప్రేమించిన నాగ చైతన్యను వివాహం చేసుకుంది. తెలుగు సినిమా పరిశ్రమలో ప్రముఖ ఫ్యామిలీ అక్కినేని కుటుంబంలోకి కోడలుగా వెళ్లింది. పెళ్లి తర్వాత సమంత ఎంతో సంతోషకరమైన జీవితం గడుపుతోంది. అయితే పెళ్లి తర్వాత కొన్ని విషయాల్లో మాత్రం మార్పు వచ్చిందని సమంత చెబుతోంది. పెళ్లి తర్వాత స్వేచ్ఛను కోల్పోవాల్సిన అవసరం రాలేదని, అయితే తనలో చాదస్తం మాత్రం బాగా పెరిగిందని సమంత చెప్పుకొచ్చారు. పెళ్లికి ముందు కూడా నాలో చాదస్తం ఉండేది, కానీ పెళ్లి తర్వాత ఇది మరింత ఎక్కువైందని సమంత తెలిపారు. కొన్ని కథలు నచ్చడం లేదు పెళ్లికి ముందుతో పోల్చుకుంటే ఇపుడు కొన్ని రకాల కథలు నచ్చడం లేదని, బహుషా ఇది పెళ్లి ప్రభావం వల్లనే ఏమో అనే సందేహం సమంత వ్యక్తం చేశారు. మంచి సినిమాలు చేతిలో ఉండటం వల్లే నచ్చని కథలను వదిలేస్తున్నానని సమంత తెలిపారు. వరుస సినిమాలతో సమంత బిజీ ప్రస్తుతం సమంత వరుస సినిమాలతో బిజీగా గడుపుతోంది. తెలుగులో రంగస్థలం', మహానటి', తమిళంలో ఇరుబుతిరై', సూపర్ డీలక్స్' చిత్రాల్లో సమంత నటిస్తున్నారు. నిర్మాతగా సమంత పెళ్లి తర్వాత సమంత తన కెరీర్ కు సంబంధించి మరో మెట్టు ఎక్కబోతున్నారు. నిర్మాతగా సినిమా చేయడానికి సిద్ధమైంది. ఈ మేరకు 'యూటర్న్' అనే కన్నడ సినిమా రైట్స్ కొనుగోలు చేసి దాన్ని తెలుగులో తీసేందుకు ప్లాన్ చేస్తోంది. కన్నడ వెర్షన్‌కు దర్శకత్వం వహించిన పవన్‌కుమార్ తెలుగులో తెరకెక్కనున్న చిత్రానికి కూడా దర్శకత్వం వహించనున్నాడు. యూ టర్న్' మూవీ డీల్ కోసం తన భర్త నాగచె%తన్యతో కలిసి ఇటీవల బెంగళూరు వెళ్లిన సమంత సినిమా ప్రివ్యూ చూసిన తర్వాత సినిమా చేయాలనే నిర్ణయానికి వచ్చిందట.

## వెంకటేష్- త్రివిక్రమ్ కాంబినేషన్లో మూవీ






విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్లో సినిమా ఖరారైంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బేనర్లో ప్రొడక్షన్ నెం.6గా ఈ చిత్రం తెరకెక్కనుంది. వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని ఖరారు చేస్తూ పోస్టర్స్ రిలీజ్ చేశారు.

త్రివిక్రమ్ దర్శకత్వం వహించబోయేఈ చిత్రం వెంకీ కెరీర్లో 75వ చిత్రం కాబోతోంది. ఈ మూవీ 2019లో ప్రేక్షకుల ముందుకు రానుంది. గురు' తర్వాత వెంకటేష్ బొమ్మరిల్లు భాస్కర్, తేజ, అనిల్ రావిపూడితో మూడు సినిమాలు కమిట్ అయ్యారు. ఈ సినిమాలు పూర్తయిన తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో సినిమా మొదలు కానుంది. దర్శకుడిగా మారక ముందు త్రివిక్రమ్ పలు చిత్రాలకు రచయితగా పని చేసిన సంగతి తెలిసిందే. అందులో వెంకీ నటించిన నువ్వు నాకు నచ్చావ్', వాసు, మల్లీశ్వరి లాంటి చిత్రాలు ఉన్నాయి.

అప్పటి నుండే వెంకీతో త్రివిక్రమ్‌కు మంచి అనుబంధం ఉంది.

వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్లో సినిమా వస్తుందని చాలా కాలంగా అభిమానులు వెయిట్ చేస్తున్నారు. ఎట్టకేలకు ఇది నిజం కాబోతోంది. హారిక హాసిని బేనర్లో ప్రొడక్షన్ 6గా ఈ ఇద్దరి సినిమా రాబోతోందని పోస్టర్స్ విడుదలైన తర్వాత పలువురు అభిమానులు సోషల్ మీడియా ద్వారా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

వెంకటేష్ సినిమా కంటే ముందు త్రివిక్రమ్.... ఎన్టీఆర్ హీరోగా ఓ సినిమా చేయబోతున్నారు. హారిక హాసిని బేనర్లో తెరకెక్కుతున్న ఈచిత్రం ఇటీవలే ప్రారంభోత్సవం జరుపుకుంది. జనవరిలో ఈ చిత్రం రెగ్యులర్ షుటింగ్ ప్రారంభం కానుంది.

## అజ్ఞాతవాసి టీజర్ డేట్ ఫిక్స్?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'అజ్ఞాతవాసి'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబతోంది. సినిమాకు సంబంధించిన న్యూ అప్డేట్స్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు గుడ్ న్యూస్. ఈ నెల 16న చిత్ర యూనిట్ నుండి సర్‌ప్రైజ్ రాబోతోంది. అజ్ఞాతవాసి' సినిమా టీజర్ డిసెంబర్ 16వ తేదీన విడుదల చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ మేరకు ఈ విషయాన్ని ఖరారు చేస్తూ కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. నేరుగా పాటల విడుదల, ఆడియో ఫంక్షన్ లేదు అజ్ఞాతవాసి' సినిమాకు ఆడియో ఫంక్షన్, ప్రీ రిలీజ్ ఫంక్షన్ లాంటివి ఏమీ నిర్వహించడం లేదు. పవన్ కళ్యాణ్ రాజకీయాలతో బిజీగా ఉండటమే ఇందుకు కారణం. దీంతో నేరుగా ఆడియో మార్కెట్లోకి విడుదల చేయాలని డిసైడ్ అయ్యారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు మంచి రెస్పాన్స్ వస్తోంది.

హిట్ కాంబినేషన్ పవన్ కళ్యాణ్, త్రివిక్రమ్ కాంబినేషన్ అంటే సూపర్ హిట్టే. గతంలో ఈ ఇద్దరి కాంబినేషన్లో వచ్చిన జల్సా', అత్తారింటికి దారేది' చిత్రాలు భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అజ్ఞాతవాసి' సినిమాతో వీరు హ్యాట్రిక్ కొట్టడం ఖాయం అంటున్నారు అభిమానులు. పవన్ కళ్యాణ్, కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయేల్ ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్‌కు జోడీగా కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయేల్ నటిస్తున్నారు. వీరి మధ్య వచ్చే రొమాంటిక్ సీన్లు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని అంటున్నారు.

## సాహోలో విలన్ నేను కాదు..



బాహుబలి చిత్రం తర్వాత ప్రభాస్ నటిస్తున్న చిత్రం సాహో. ఈ సినిమా యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో రూపుదిద్దుకొంటున్న చిత్రానికి రన్ రాజా రన్ దర్శకుడు సుజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా బాలీవుడ్ నటి శ్రద్ధాకపూర్ తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికరమైన వార్త మీడియాలో వెలుగు చేసింది. సాహ చిత్రంలో బాలీవుడ్ నటుడు నీల్ నితిన్ ముఖేష్ విలన్‌గా కనిపిస్తున్నారు. అయితే ఈ చిత్రంలో మరో విలన్ కూడా ఉన్నారు. ఆ విలన్ పాత్రను తమిళ నటుడు అరుణ్ విజయ్ పోషిస్తున్నట్టు మీడియాలో వార్తలు విస్తృతంగా ప్రచారం అయ్యాయి. అయితే ఆ వార్తలపై స్పందించిన అరుణ్ విజయ్ ఈ కన్ఫ్యూజన్‌పై క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం థాండమ్ చిత్ర షుటింగ్‌లో బిజీగా ఉన్నాను. సాహోలో ఓ కీలక పాత్రను పోషిస్తున్నాను. అయితే నీల్ నితిన్ ముఖేష్‌తో కలిసి విలన్ పాత్రలో కనిపిస్తున్నాను అనే వార్తలో నిజం లేదు అరుణ్ విజయ్ తెలిపారు. గౌతమ్ మీనన్ దర్శకత్వంలో అజిత్ నటించిన యెన్నై అరిందాల్ చిత్రంలో అరుణ్ విజయ్ పోషించిన విలన్ పాత్రకు మంచి స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. నేను నెగిటివ్ షేడ్ ఉన్న పాత్రలో నటించడం లేదు. నాది పాజిటివ్ క్యారెక్టర్. ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రంలో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. ఇంకా నాపై కొన్ని సన్నివేశాల చిత్రీకరించాల్సి ఉంది అని అరుణ్ విజయ వెల్లడించారు. థాండమ్ చిత్రం తర్వాత గౌతమ్ మీనన్ దర్శకత్వంలో రూపొందే సినిమాలో నటిస్తున్నాను. ఈ చిత్రం 2018 ద్వితీయార్థంలో ప్రారంభం అవుతుంది. నాకు కెరీర్‌లో 25వ చిత్రం అని అరుణ్ విజయ్ తెలిపారు. కాగా, సాహో చిత్రంలో యాక్షన్ సీన్లను భారీ ఎత్తున చిత్రీకరిస్తున్నట్టు తెలుస్తున్నది. అంతర్జాతీయ స్థాయిలో ఈ సన్నివేశాలను చిత్రీకరించేందుకు హాలీవుడ్ నుంచి కెన్నీ బేట్స్ అనే యాక్షన్ డైరెక్టర్‌ను రప్పించారు. ఈయన గతంలో డైహార్డ్, ట్రాన్స్‌ఫార్మర్ చిత్రాలకు ఫైట్స్ సమకూర్చారు.

